

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం

01 ఫిబ్రవరి 2026 పేజీలు : 08


## 2047 నాటికి 50 శాతం పచ్చదనం సాధనే

# ప్రభుత్వ లక్ష్యం



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :**

స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల్లో భాగంగా 2047 నాటికి రాష్ట్రంలో 50 శాతం పచ్చదనమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. కందుకూరు నియోజకవర్గ కేంద్రంలో స్కందపురి సేవా సమితి, టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో కళాశాలలోని 2 ఎకరాల ప్రాంగణంలో తొలిసారి చేపట్టిన మియావాకి ఫారెస్ట్ ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజబాబు, సబ్ కలెక్టర్ హిమ వంశీ, మాజీ ఎంఎల్ఏ దివి శివరామ్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. మియావాకి ఫారెస్ట్ ప్రాజెక్ట్‌లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. మియావాకి ప్రాజెక్టు వల్ల కందుకూరు నియోజకవర్గంలో పచ్చదనం పెరుగుతుందన్నారు. స్కందపురి సేవా సమితి ప్రోత్సాహంతో ఈ ప్రాజెక్టు విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సమితి ఛైర్‌పర్సన్ మౌనికను అభినందించారు. ఒకే రోజు 2 ఎకరాల్లో 2 వేల మొక్కలు నాటడం గొప్ప విషయమని చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, రాష్ట్రంలో ప్రస్తుతం 30 శాతం పచ్చదనం ఉంటే, నెల్లూరు జిల్లాలో 22 శాతం పచ్చదనం ఉందన్నారు. స్వర్ణ ఆంధ్ర-2047 లక్ష్యాలలో భాగంగా 2047 నాటికి రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. మియావాకి ప్రాజెక్టులో స్థానిక జాతి మొక్కలు నాటడం వల్ల పచ్చదనంతో పాటు పెరుగుదల కూడా వేగంగా ఉంటుందని చెప్పారు. మియవాకీ లాంటి ప్రాజెక్టులు అన్ని ప్రాంతాల్లో చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఢిల్లీ కాలుష్యం మనకు కనిపిస్తోందని, కాలుష్యానికి కళ్లు కూడా మండుతుంటాయన్నారు. ఒక చెట్టు నరకాల్సి వస్తే 10 మొక్కలు నాటేలా ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి ప్రకృతి పరిరక్షణకు కృషి చేయాలని, నేడు మనం నాటే మొక్కలే రేపటి తరానికి ఊపిరి అందిస్తాయన్నారు. మొక్కలు నాటడం ఒక ఉద్యమంగా చేపట్టాలని, భవిష్యత్ తరాలు సుభిక్షంగా ఉంటాయన్నారు. ఈ లక్ష్యసాధనలో ఇలాంటి నగర వనాలు కూడా ఎంతగానో దోహదపడతాయన్నారు.

మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. కాలుష్యాన్ని తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా నగరవనాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 50 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ ప్రాంగణంలో మరిన్ని విద్యాసంస్థలు, -మిగతా 2లో

**పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు నడుం బిగించాలి**

**మియావాకి ఫారెస్ట్ ప్రాజెక్టును అన్నిచోట్ల అమలు చేయాలి**

**మొక్కలు పెంచితేనే భవిష్యత్తు తరాలకు ఊపిరి**



## ఒక్కరోజు ముందే..

# పింఛన్ల పండగ

జట్లకొండూరు, మడమనూరులో పింఛన్లు పంపిణీ చేసిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

వివరాలు 2లో

## ప్రజాక్షేత్రంలో ప్రజలు ఛీ కొట్టినా

# బుద్ధి రాలేదు



02 పేజీలో

## కూటమి ప్రభుత్వానికి

# కాకాణి సవాల్



04 పేజీలో

# నెల్లూరుకు మహర్దశ



- దుమ్ము లేని నగరంగా తీర్చిదిద్దుతాం
- రూ.11.75 కోట్లతో ఎండ్-టు-ఎండ్ రోడ్ల నిర్మాణం
- అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజలే బుద్ధి చెబుతారు
- కుట్ర రాజకీయాలపై మంత్రి నారాయణ ఫైర్
- మార్చికల్లా మారునున్న నెల్లూరు ముఖచిత్రం
- మంత్రి నారాయణ మాస్టర్ ప్లాన్

**నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :**

నెల్లూరు నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి నారాయణ అన్నారు. శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి.. కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. 45వ డివిజన్ రామ్మూర్తి నగర్‌లో కోటి 7 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న ఎండ్-టు-ఎండ్ రోడ్డు పనులకు మంత్రి నారాయణ శంకుస్థాపన చేశారు. అనంతరం రంగనాయకులపేట గాలిగోపురం వద్ద జరుగుతున్న ఆధునీకరణ పనులు, మూలాపేటలో రామిరెడ్డి కాలువ ఆధునీకరణ పనులను ఆయన స్వయంగా పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. నెల్లూరు నగరాన్ని దుమ్ము లేని నగరంగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇందుకోసం నగరం -మిగతా 2లో

## రూ.85 లక్షలతో గంగవరం గ్రామంలో..

# అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు

### సంక్షేమం అభివృద్ధే అభివృద్ధే కూటమి ప్రభుత్వ విధానం : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** వృద్ధులు, దివ్యాంగుల అవసరాలను తన అవసరంగా భావించి 1 వ తేదీ ఆదివారం వస్తే ఒకరోజు ముందే పెన్షన్ అందిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మానవీయ పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రశంసించారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలో పెన్షన్ పంపిణీ అనంతరం రూ.80 లక్షల విలువైన వివిధ అభివృద్ధి పనులు ప్రారం భోత్సవ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. సిఎం చంద్రబాబు నాయుడు ఇంటికి పెద్ద కొడుకుగా బాధ్యతను నెరవేరుస్తూ ప్రజా సంక్షేమం కోసం పాటు పడుతున్నారని కొనియాడారు. చంద్రబాబు నాయుడి పాలనలో అభివృద్ధి, సంక్షేమాలే కాదు అంతకు మించిన మానవత్వం ఉందని, చెప్పడానికి పెన్షన్లు ఒక రోజు ముందు ఇవ్వడమే నిదర్శనమన్నారు. ఇలాంటి సహృదయం ఉన్న నాయకుడు ముఖ్య మంత్రిగా ఉండడం రాష్ట్ర ప్రజల అదృష్టం అన్నా రు. గ్రామాలలో మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తన ప్రథమ ప్రాధాన్యత అని ఎన్నికల సందర్భంగా చేసిన వాగ్దానానికి కట్టుబడి గత ప్రభుత్వ పాలనలో అసంపూర్తిగా వదిలేసిన సచివాలయ భవనాన్ని 43 లక్షలతో పూర్తి చేసిన సంఘటన గురించి ఆమె ప్రజలకు వివరించారు. ఎవరు శంఖుస్థాపన చేశారన్న విషయాన్ని పక్కన పెట్టి ప్రజావసరాలకే తాను ప్రాధాన్యత ఇస్తానన్నారు. గంగవరం గ్రామంలో 43 లక్షల 60 వేలతో సచివాలయ భవనం, శ్రీనివాసపురం కాలనీలో 4 లక్షలతో సిమెంట్ గంగవరం గ్రామంలో 5 లక్షలతో మరో సిమెంట్ సిమెంట్ రోడ్లు, గంగవరం కాలువపై 10 లక్షల తో కల్వర్టు నిర్మాణంతో పాటు గంగవరం గ్రామ సమీపంలోని గంగవరం ఛానల్, దాని అనుబంధ సాగునీటి కాలువలను ఇరిగేషన్ శాఖ ద్వారా 28 లక్షల 18 వేలతో మరమత్తు పనుల ప్రారంభోత్సవాలు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. 15వ ఆర్థిక సంఘ నిధులు సర్పంచులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె స్థానిక సర్పంచ్‌కు సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి ఎన్నికల హామీలైన 'సూపర్ సిక్స్' పథకాలైన తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే స్త్రీ శక్తి, గృహిణులకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందచేసే దీపం పథకం, అన్నదాత తదితర సంక్షేమ పథకాల గురించి ఆమె ప్రజలకు వివరించారు. సాగునీటి వరికి గిట్టుబాటు ధర, కాలువల పూడికతీత, రైతులకు పుష్కలంగా యూరియా పంపిణి చేసిన విషయాలను ఎమ్మెల్యే ప్రస్తావించారు. కార్యక్రమంలో కోవూరు మండల అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, పెన్నా డెల్టా ఛైర్మెన్ జెట్టి రాజగోపాల్ రెడ్డి, జొన్నవాడ ఆలయ ఛైర్మెన్ తిరుమారు అశోక్ రెడ్డి, ఎంపీపీ తుమ్మల పార్వతి, సర్పంచ్ లక్ష్మమ్మ, నాయకులు శ్రీధర్ నాయుడు, లక్ష్మి నరసింహారెడ్డి, బూదూరు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 2047 నాటికి 50 శాతం పచ్చదనం సాధనే.. ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

నగర వనాలు రావలసిన అవసరం ఉందన్నారు. సామాజిక స్పృహతో, ముందు చూపుతో ప్రతి ఒక్కరూ ఇలాంటి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ.. ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహించే స్వచ్ఛంద సంస్థలకు వ్యక్తిగతంగా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆక్సిజన్ కొనుక్కునే పరిస్థితి రాకూడదన్నారు. భావితరాలకు మంచి పర్యావరణాన్ని అందించే క్రమంలో ప్రభుత్వానికి స్వచ్ఛంద సేవా సంస్థలు కూడా తోడుగా నిలవాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యాభ్యాసంతో పాటు పర్యావరణాన్ని కాపాడుకోవడంపైనా బాల్యదశ నుంచే ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలన్నారు. నేడు నాటే ఈ మొక్కలు 30 ఏళ్లలో మహా వనంగా మారి భావితరాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. సుస్థిరాభివృద్ధి సాధనలో ఇలాంటి నగరవనాలు ఎంతో కీలకం అన్నారు. దివి శివరాం మాట్లాడుతూ అభివృద్ధితో పాటు ఇలాంటి నగర వనాల ద్వారా పర్యావరణాన్ని కూడా కాపాడుకోవచ్చున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనూష, కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్, టీడీపీ నాయకులు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, గుడిహరిరెడ్డి, ఇతర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## ఒక్క రోజు ముందే పింఛన్ల పండగ

### జట్లకొండూరు, మడమనూరులో పింఛన్లు పంపిణీ చేసిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

**మనుబోలు, మేజర్‌న్యూస్ :** మనుబోలు మండలంలో 5564 మంది ప్రతి నెలా పింఛన్లు పొందుతున్నారని, ఈ ఒక్క మండలంలోనే నెలకు రూ.2.40 కోట్లు, ఏడాదికి రూ.30 కోట్లు పింఛన్లు అందుతున్నాయని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం సెలవు రోజు కావడంతో ఒక్కరోజు ముందే పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా పింఛన్ల కోసం నెలకు రూ.2700 కోట్లు ప్రభుత్వం ఖర్చు పెడుతోందన్నారు. ఏడాదికి రూ.33 వేల కోట్లను పింఛన్ల కోసం ఖర్చుపెట్టడం దేశంలోనే ఒక చరిత్ర అన్నారు. వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలు పింఛన్ ఇస్తున్న రాష్ట్రం దేశంలో మరొకటి లేదని, ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే ఇది సాధ్యమవుతోందన్నారు. మహా నగరాలైన హైదరాబాద్, ముంబైలను కలిగిన తెలంగాణ, మహారాష్ట్రలు పింఛన్‌గా ఇస్తుంది రూ.2 వేలు, రూ.1200 మాత్రమే అన్నారు. బెంగళూరును రాజధానిగా కలిగిన రూ.600, చెన్నై రాజధానిగా ఉన్న తమిళనాడులో రూ.1000 మాత్రమే ఇస్తున్నారన్నారు. ఒక్క పింఛన్ మాత్రమే కాదు.. తల్లికి వందనం పథకం ద్వారా ఒక ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అందరికీ సాయం అందుతోందన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అందించే స్త్రీశక్తి పథకం విజయవంతంగా అమలవుతోందన్నారు. స్త్రీశక్తి పథకానికి ఊహించని స్పందన లభిస్తుండటంతో కొత్త బస్సుల కొనుగోలుతో పాటు అదనపు సిబ్బంది నియామకానికి ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారన్నారు. దీపం పథకంతో ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందుతున్నాయని, కూటమి ప్రభుత్వం ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ముందుకెళుతోందన్నారు. గత ప్రభుత్వంలో కీలక శాఖలను మూసివేయడంతో పాటు వివిధ రూపాల్లో ప్రజలను ఇబ్బందుల్లోకి నెట్టారన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్, రీసర్వే పేరుతో రెవెన్యూ రికార్డులను అస్తవ్యస్తంగా మార్చేశారన్నారు. వైసీపీ పాలనలో జరిగిన పొరపాట్లతో రెవెన్యూ కార్యాలయాలకు లక్షలాదిగా అర్జీలు పోటెత్తుతున్నాయని, భూ సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు తలలు పట్టుకుంటున్న పరిస్థితి అన్నారు. కూటమి ప్రభుత్వం సమస్యలన్నింటిని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తోందన్నారు. గ్రామాల్లో శాశ్వతంగా నిలిచిపోయే పనులను చేపడుతున్నామని, రూ.3.17 కోట్లతో మనుబోలు మండలంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, పంచాయతీ కార్యాలయాలు నిర్మిస్తున్నామన్నారు. అస్తవ్యస్తంగా మారిన రోడ్లను బాగుచేసేందుకు నిధులు తెస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సర్వేపల్లిలో రూ.350 కోట్లతో పనులు చేపట్టామన్నారు. కక్షసాధింపులకు అవకాశం లేకుండా వైసీపీ పాలనలో అన్యాయానికి గురైన వారందరికీ న్యాయం చేస్తున్నామని పేర్కొన్నారు.

## నెల్లూరుకు మహర్దశ



(మొదటి పేజీ తరువాయి)

మొత్తమ్మీద 96 ప్రాంతాల్లో 11 కోట్ల 75 లక్షల రూపాయలతో ఎండ్-టు-ఎండ్ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ పనులన్నీ మార్చి నెలాఖరుకల్లా పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్యం కోసం నెల్లూరుకు 28 స్వీపింగ్ మిషన్లు కేటాయించినట్లు చెప్పారు. నగరాన్ని పచ్చదనంతో నింపేందుకు 13 డివిజన్లలో 20 కోట్లతో మొక్కలు నాటే కార్యక్రమం చెప్పినట్లు మంత్రి తెలిపారు. ముంపు ముప్పు నుంచి తప్పించేందుకు ప్రత్యేక మాస్టర్ ప్లాన్ అమలు చేస్తున్నామన్నారు. కాలువల ఆధునీకరణ వల్ల ఎవరైనా ఇళ్లు కోల్పోతే వారికి ప్రభుత్వం తరపున ప్రత్యామ్నాయం చూపిస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులపై జరుగుతున్న రాజకీయంపై మంత్రి నారాయణ తీవ్రంగా స్పందించారు. ప్రజలకు మేలు జరుగుతుంటే కావాలనే కొందరు కుట్రలు చేస్తున్నారని, అభివృద్ధిని అడ్డుకునే వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని మంత్రి నారాయణ హెచ్చరించారు. కార్యక్రమంలో నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, రాష్ట్ర వేర్ హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ కపిర శ్రీనివాసులు, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ, మాజీ జెడ్పిటీసీ విజేతా రెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్లు సుజన్, మనోహర్, క్లస్టర్ ఇంచార్జిలు అన్నంగి ప్రసాద్, యస్వంత్, కో క్లస్టర్ డాక్టర్ పోకల రవి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## పేదల అభ్యుదయమే
# సీఎం చంద్రబాబు లక్ష్యం



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** పేదల అభ్యుదయమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. కందుకూరు నియోజకవర్గ కేంద్రంలోని 4, 32 వార్డులో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజబాబు, సబ్ కలెక్టర్ హిమవంశీ, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ, టిడిపి జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్రలతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. 1వ తేదీ కంటే ముందే అర్హులకు పింఛన్లు అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికే చెందుతుందన్నారు. ఎంతో మంది వృద్ధులు, నిరుపేదలు దివ్యాంగుల ఇంట పండుగ వాతావరణం నెలకొందని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వంపై ప్రజల ఆశీస్సులు ఇలాగే కొనసాగాలని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా క్షేత్రంలో ప్రజలు ఛీకొట్టినా బుద్ధి రాలేదు

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ఉద్దేశించి వైసిపి నాయకులు అంబటి రాంబాబు సంస్కార రహిత వాఖ్యలపై కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఫైరయ్యారు. సభ్యతా సంస్కారాలు మరిచి నోరు పారేసుకునే వైసిపి నేతల నోళ్లు మూయించడానికి ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి సూచించారు. వైసిపి నేతల ఆగడాలు భరించలేకే ఆ పార్టీ అభ్యర్థులను చిత్తు చిత్తుగా ఓడించి కూటమి పార్టీలకు ప్రజలు 164 సీట్లితో అధికారమిచ్చినా.. వైసిపి నేతలలో మార్పు రాలేదనన్నారు. విచక్షణ కోల్పోయి నోరు పారేసుకునే నేతలకు ప్రజలే మరోసారి బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి శాపనార్థాలు పెట్టారు.

# గ్రామీణ విద్యార్థులకు అంతర్జాతీయ శిక్షణే లక్ష్యం : మ్యాక్ స్పీడ్ సీఈవో

**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** మారుమూల గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ అందించే ఉన్నత శిఖరాల వైపు తీసుకెళ్లడమే లక్ష్యంగా ఎంచుకొని ముందుకు అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జిల్లాలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు బ్యాక్ స్పీడ్ సీఈవో పుట్టం అశోక్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం మ్యాప్ స్పీడ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన తల్లిదండ్రులు తోపాటు విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సు అనూహ్యంగా విజయవంతమైంది. ఈ సందర్భంగా సీఈవో అశోక్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో సాధికారత సాధించి ఉన్నత స్థితికి ఎదిగేందుకు తోడ్పాటునందించే నాణ్యమైన శిక్షణను అందించడమే మ్యాక్ స్పీడ్ ఎడ్యుకేషనల్ సొసైటీ యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. ఐఐటి, నీట్, ఒలంపియాడ్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న గ్రామీణ ప్రాంత విద్యార్థుల కొరకు ప్రత్యేకంగా రూపొందించిన అడ్వాన్స్ సిప్ ప్రోగ్రాం యొక్క ఆవశ్యకతను గురించి తల్లిదండ్రులకు క్షుణ్ణంగా వివరించడం జరిగిందన్నారు. శనివారం నిర్వహించిన అవగాహన సదస్సు ద్వారా నూతన విద్యా విధానం (నెప్),



విద్యార్థుల సమగ్ర వికాసం తోపాటు పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు పాటించాల్సిన మేలుకువలు, నియమాలపై సుదీర్ఘంగా చర్చించి వివరించడం జరిగిందన్నారు. ఈ సదస్సుకు పెద్ద సంఖ్యలో హాజరైన తల్లిదండ్రులు తమ తమ సందేహాలను మ్యాక్ స్పీడ్ బృందం ద్వారా నివృత్తి చేసుకోవడం జరిగిందన్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థుల భవిష్యత్తుకు మ్యాప్ స్పీడ్ ద్వారా నిర్వహించిన సదస్సు ఎంతో ఉపయోగకరమవుతుందని ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులతోపాటు విద్యార్థుల సైతం ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఒకరోజు ముందుగానే పెన్షన్ పంపిణీ

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని వింజమూరులోని నడిమూరు ప్రాంతంలో ఒకరోజు ముందుగానే అధికారులు, ప్రజా ప్రతినిధులు పంపిణీ చేసారు. ఈ సందర్బంగా ఎంపిడీఓ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ.. ఫిబ్రవరి 1 తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే పెన్షన్ పంపిణీ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పంపిణీ చేయడం జరుగుతుందని ఎంపీడీవో తెలియజేశారు. వింజమూరు మండలంలో దాదాపుగా 5506 మంది లబ్దిదారులకు 2కోట్ల 46 లక్షల రూపాయలు మంజూరు చేసి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి మాట్లాడుతూ.. ప్రతినెల పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని కూటమి నాయుకులు అధికారులతో సమన్వయ పరుచుకొని ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమలో ఎంపీపీ వనిపెంట హైమావతి, నాయుకులు సుబ్బారెడ్డి, పంచాయతీ ఈఓ రామారావు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని తాటిపర్తి సమీపం లోని కనుపూరు కాలువ కట్ట నుంచి శనివారం అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను పొదలకూరు పోలీసులు అడ్డుకున్నారు. తాటిపర్తి గ్రామానికి చెందిన ఓ వైసిపి నాయకుడు వరదాపురంలోని సీలింగ్ పొలంలో రెండు రోజులుగా మట్టితోలి చదును చేసే ప్రయత్నం చేస్తున్నాడు. ఇందులో భాగంగా సమీపంలోని కనుపూరు కెనాల్ కట్ట నుంచి అక్రమంగా మట్టి తరలిస్తుండగా గ్రామస్తులు ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. కాలువ కట్ట మట్టి తరలిస్తే కట్ట భద్రతకు ప్రమాదమని భావించిన ఇరిగేషన్ అధికారులు పొదలకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మహమ్మద్ హనీఫ్ తన సిబ్బందితో వెళ్లి అక్రమంగా మట్టి తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు ఒక జేసిబిని పోలీస్ స్టేషన్ కు తరలించి సీజ్ చేశారు. అయితే మట్టి తోలుకుంటున్న వైసీపీ నాయకుడు తమకు ఏఎమ్మార్ సమస్థ అనుమతులు ఉన్నాయని ఎక్కడినుంచైనా తోలుకోవచ్చని పోలీసులకు వివరించాడు. దీనిపై పొదలకూరు పోలీసులు విచారణ జరుపుతున్నారు.



## ప్రకృతి వ్యవసాయంలో మట్టి నమూన సేకరణ కీలకం

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** ప్రకృతి వ్యవసాయంలో మట్టి నమూన సేకరణ కీలకమని మండల వ్యవసాయ అధికారి వి.ప్రతాప్అన్నారు. నేషనల్ మిషన్ ఆన్ న్యాచురల్ ఫార్మింగ్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన సిబ్బందితో కలిసి మండలంలోని బిరదవోలు, అమ్మవారిపాలెం, మరుపూరు, అయ్యగారిపాలెం, నావూరు, ప్రభగిరిపట్నం, తోడేరు గ్రామాల్లో కలిపి 333 మట్టి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ప్రతాప్ మాట్లాడుతూ.. మట్టిలోని పోషకాలు స్థాయి తెలుసుకోవడానికి, జీవ-సూక్ష్మజీవుల క్రియాశీలత, ప్రకృతి సేద్యం పద్ధతులు మట్టిపై ఎలా ప్రభావం చూపుతున్నాయి, జీవామృతం, ఘన జీవామృతాన్ని ఎలా వినియోగించాలో తెలుసుకొనే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రాజమోహన్ రెడ్డి, విహెచ్ఏ సి.మౌనిక, ఏపీసీఎన్ఫ్ సిబ్బంది అరుణ స్థానిక రైతులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ : టీడీపీ నాయకులు

**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** మండలంలోని పెద్దిరెడ్డి పల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు ఉదయగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చంద్ర మధుసూదన్ రావు, ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వృద్ధులకు, వికలాంగులకు పెన్షన్లు పంపిణీ చేశారు. చంద్ర మధుసూదన్ రావు మాట్లాడుతూ మొట్టమొదటిగా పెన్షన్ పథకాన్ని ప్రవేశ పెట్టినటువంటి ఏకైక ప్రభుత్వం తెలుగుదేశం పార్టీ నాటి నుంచి నేటి వరకు అంచలంచలుగా పెన్షన్ నగదు పెంచినటువంటి ఘనత ఒక్క తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని అన్నారు. ఒకటో తారీకు ఆదివారం వస్తుంది అంటే ఒకరోజు ముందుగానే పెన్షన్ లబ్ధిదారులకు సచివాలయం సిబ్బంది ద్వారా అందిస్తూ వారి జీవితాలలో వెలుగులు నింపుతూ ఆర్థిక భరోసా కల్పిస్తున్న ప్రభుత్వం తెలుగుదేశం పార్టీ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి యూనిట్ ఇన్చార్జి నాదెళ్ల రాజా, టిడిపి నాయకులు చెక్కా మాధవరావు, సీనియర్ నాయకులు. షేక్ ఖాజా మస్తాన్, అదుసుమల్లి రమేష్ బాబు, పిచ్చయ్య, జంపాల వెంకటస్వామి, నాదేళ్ల భాస్కర్, నాగం చిన్న నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్లు పంపిణీ చేసిన మున్సిపల్ ఛైర్ పర్సన్

**బుచ్చిరెడ్డిపాళెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిరెడ్డిపాళెం మునిసిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో స్థానిక నాయకులతో కలసి ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజా మురళి శనివారం పలువురు లబ్ది దారులకు ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈసందర్బంగా ఆమె మాట్లాడుతూ.. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచనల మేరకు పింఛన్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. లబ్ధిదారుల ఇళ్ళకు వెళ్ళి పింఛన్ పంపిణీ చేసినప్పుడు వారి కళ్ళలో ఆనందం చూసి సంతోషం కలిగిందన్నారు. రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉన్నప్పటికీ, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెల టంచన్‌గా పింఛన్లు పంపిణీ చేస్తున్నారన్నారు. ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి నిబద్ధతకు నిదర్శనమన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా ఆయన పరిపాలన సాగుతుందని ఆమె కొనియాడారు. 1వతేది వస్తే ఒక రోజు ముందుగానే పింఛన్ పంపిణీ చేయడం కూటమి ప్రభుత్వంలోనే జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఛైర్ పర్సన్ వెంట 4వవార్డు ఇంచార్జి మహేంద్రనాథ్ రెడ్డి, టిడిపి నాయకులు నరేష్ కుమార్, కరుణాకర్, దశయ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వేలూరు ఉమా మహేష్‌కు వైసీపీలో రాష్ట్రస్థాయి పదవి



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సూచనలు మేరకు వైయస్ జగన్మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యవర్గంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా వైయస్సార్సీపి 46వ డివిజన్ కార్పొరేటర్ వేలూరు ఉమామహేష్ శనివారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా వేలూరు ఉమా మహేష్ వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. పార్టీ ఆదేశాల మేరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీబలోపేతం దిశగా పనిచేస్తానని తెలియజేశారు.

## మహిళా కార్మికులకు స్టీల్ వాటర్ బాటిళ్ళు, టోపీలు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కృష్ణపట్నం పోర్టులో పనిచేస్తున్న మహిళా కార్మికులకు శనివారం ఏకేపీఎల్ యాజమాన్యం కంపెనీ స్టీల్ వాటర్ బాటిళ్ళను పంపిణీ చేసింది. మహిళా కార్మికులు త్రాగునీరు సేవించేవిషయంలో నిర్లక్ష్యంగా ఉండకుండా వాటర్ బాటిళ్ళు పంపిణీ చేసినట్లు సంస్థ తెలియజేసింది. అదేవిధంగా ఎండ వేడి నుండి రక్షించుకునేందుకు టోపీలు అందజేశారు. సుమారు 800 మంది మహిళా కార్మికులు ప్రయోజనం పొందినట్లు సీఈఓ వెల్లడించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## నిరుద్యోగ యువతకు ఉచిత స్కిల్ ట్రైనింగ్

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** కేంద్ర ప్రభుత్వ ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవివై) కింద విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఏపిఎస్ఎస్‌డిసి, ఎన్ఎస్‌డిసి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణలో అప్లికేషన్ డెవలపర్ - వెబ్ అండ్ మొబైల్ కోర్సును అందించనున్నారు. డిగ్రీ, డిప్లొమా, పీజీ, బీటెక్ పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులు. శిక్షణ అనంతరం జాతీయ స్థాయి సర్టిఫికెట్‌తో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. ఫిబ్రవరి 5న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వీఎస్‌యూ కళాశాల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చునని, డా. జె.విజేత-9573482179 ఈ నెంబర్‌కు సంప్రదించాలని తెలియజేశారు.

## వీఎస్‌యూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలో శనివారం నిర్వహించిన మొదటి (రెగ్యులర్, సప్లిమెంటరీ) జనవరి-2026 డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు 7,817 మంది నమోదు కాగా 7,297 మంది హాజరయ్యారు. 520 మంది గైర్హాజరయ్యారు. వెంకటగిరి విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రంలో నలుగురు విద్యార్థులను డీబార్ చేసినట్లు అధికారులు తెలిపారు.

## సత్యమే గెలిచింది.. : వైసీపీ



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వస్వామి సన్నిధిలో జరిగిన లడ్డు విషయంలో విష ప్రచారం చేసిన కూటమి ప్రభుత్వానికి చెంప పెట్టు లాగా సిబిఐ, షిట్ ఇచ్చిన నివే దిక ఆధారంగా జంతు అవశేషాలు లేవని తీర్పునిచ్చింది. అందులో భాగంగానే ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజ గోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో మండల కన్వీనర్ రేవనూరు శ్రీనివాసరెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు పల్లాల. కొండారెడ్డి ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామి సన్నిధిలో కొబ్బరికా యలు కొట్టి,ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతి లడ్డు ప్రసాదంలో కల్తీ జరిగిందని ఆరోపణలు అవాస్తము అంటూ వైఎస్ఆర్సిపి నాయకులు తెలియజేశారు. కూటమి ప్రభుత్వం నీచ రాజకీయాలకు తెరలేపి, దేవుళ్ళు పై కూడా విష ప్రచారాలు చేయడం సిగ్గుచేటు అని వారు మండిపడ్డారు. సత్యం ఎప్పుడు గెలుస్తుందనీ వారు అభిప్రాయపడ్డారు. జడ్పిటిసి బాలకృష్ణారెడ్డి, నారపరెడ్డి, మలిరెడ్డి విజయ్ కుమార్ రెడ్డి, లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, రమేష్ రెడ్డి కొండయ్య, ఖాజా రెడ్డి, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షురాలుగా మల్లి నిర్మల



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సూచనలు మేరకు వైయస్సార్సీపి రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షురాలుగా మల్లి నిర్మల నియమితులయ్యారు. ఈ సందర్భంగా మల్లి నిర్మల వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని శనివారం కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ ఆదేశాల మేరకు.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతం దిశగా పనిచేస్తానని మల్లి నిర్మల ఈ సందర్భంగా తెలియజేశారు.

# కూటమి పాలనలో ప్రజా స్వామ్యం ఖూనీ : కాకాణి

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఇంచార్జ్ ఆనం విజయ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జీపీఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన వైయస్సార్సీపీ సంస్థాగత నిర్మాణ సభ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డితో కలిసి మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు 8 నుండి 10,వేలమంది గ్రామ, వార్డు కమిటీ సభ్యులకు అవకాశం లభిస్తుంది. గ్రామ, వార్డు స్థాయిలో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు కార్డులు ఇచ్చి, జగనన్న ప్రభుత్వంలో పెద్దపీట వేస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. 2027లో జమిలి ఎన్నికలు వస్తాయా.. 2029లో సాధారణ ఎన్నికలు వస్తాయా ఎప్పుడు ఎన్నికలు వచ్చినా జగన్ మోహన్ రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావడం ఖాయమని, రాబోవు జగనన్న 2.0లో కార్యకర్తలందరికీ మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. దమ్ము ధైర్యం లేని వారు బయటకు వెళ్లిపోయారు ఇప్పుడు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఉండే వాళ్లు నీతి నిజాయితీ కలిగిన నిజమైన జగనన్న సైనికులు. జగన్ మోహన్ రెడ్డి 17 మెడికల్ కళాశాలలు తీసుకొచ్చి పేద విద్యార్థులను డాక్టర్లను చెయ్యాలని చుస్తే, వాటిని ప్రవేట్ పరం చేసి లబ్ది పొందాలని చంద్రబాబు ప్రయత్నించాడని, పేదవారి కోసం 17 మెడికల్ కళాశాలలు జగన్మోహన్ రెడ్డి తీసుకువచ్చారా అని ప్రజలకు ఇప్పుడు అర్థమైందన్నారు. చంద్రబాబు ఎన్నికలకు ముందు దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి రావడం, అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు వేళ్ళు చూపించి మూడు పంగనామాలు పెట్టడం మనం చూస్తున్నామన్నారు. నిమ్మల రామా నాయుడు ఎన్నికలకు ముందు ప్రతి మహిళకూ నీకు 18వేలు, నీకు 18వేలు, నీకు 15వేలు, అని చెప్పి ఇప్పుడు ఎక్కడికి పోయాడో తెలిన పరిస్థితి. చంద్రబాబు తల్లికి వందనం ఇస్తానని చెప్పి దాదాపు రాష్ట్రంలో 40 శాతం మంది తల్లులకు ఎగనామం పెట్టాడన్నారు.



జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రతి ఇంటికి సరుకులు డోర్ డెలివరీ చేస్తే కూటమిపాలనలో మద్యం డోర్ డెలివరీ చేస్తున్నారు. మద్యం విషయంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై సోషల్ మీడియాలో, బహిరంగంగా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణ పై మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, తమ భర్తలు తాగి వచ్చి దురుసుగా ప్రవర్తించి కొడుతున్నారని బాధపడుతున్నారు. చంద్రబాబు చెప్పే కొత్త టెక్నాలజీ.. బెల్ట్ షాప్ నిర్వాహకులు వాట్సాప్ గ్రూపుల ఏర్పాటు చేసి తద్వారా తమకు కావాల్సిన బ్రాండ్లను ఆర్డర్ చేస్తే 24 గంటలూ మద్యం ఇంటికే సరఫరా అయ్యే పరిస్థితి ఈరాష్ట్రంలో నెలకొంది. విచ్చలవిడిగా మద్యం లభ్యత వల్ల గ్రామీణ మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెన్షన్ పంపిణీ గతంలో గౌరవప్రదమైన వ్యక్తులు అందజేసేవారు, కూటమి ప్రభుత్వంలో సమాజంలో నేర ప్రవృత్తి ఉన్నవారు, వార్డు మెంబర్ గా గెలవలేని లేని వారి ద్వారా పెన్షన్లు పంపిణీ చేస్తున్నారు, పెన్షన్ తీసుకునే వాళ్ళు వీళ్ళ చేత పెన్షన్ తీసుకునే కర్మ ఏర్పడిందని బాధపడుతున్నారు. ఏ గ్రామంలోకి వెళ్లినా ప్రజలు జగన్మోహన్ రెడ్డి మళ్ళీ తిరిగి సీఎం కావాలని బలంగా కోరుకుంటున్నారు. విజయ్ కుమార్ రెడ్డిని రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించి మంచి మెజారిటీతో గెలిపించాలని కోరుకుంటున్నారని తెలియజేశారు.

## ఏకేపీఎల్ లో భద్రతా ప్రమాణాలు పాటిస్తాం : సీఈఓ



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ఏకెపిఎల్ నందు భద్రతా ప్రమాణాలు పాటిస్తామని సీఈవో జగదీష్ పటేల్ అన్నారు. శనివారం కృష్ణ పట్నం పోర్టులో జాతీయ రహదారి భద్రత మాసం కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఆన్లైన్ ద్వారా డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు పంపిణీ కార్యక్రమాన్ని సీఈవో నిర్వహించారు. అనంతరం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మాట్లాడారు. కార్మికుల భద్రత తమ ప్రధాన లక్ష్యమని సీఈఓ అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల కళాశాలలో వార్షికోత్సవ వేడుకలు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో శనివారం కళాశాల వార్షికోత్సవ వేడుకల కార్య క్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖ ఉన్నతాధికారులు మధుసూదన్, హేమ సుందర్ ముఖ్య అతిథులుగా విచ్చేయగా కళాశాల ప్రిన్సిపల్ సుజాత స్వాగతం పలికారు. పాఠశాల అధ్యాపకులతో పాటు విద్యార్థిని ల తల్లిదండ్రులు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ పాల్గొన్నారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు విద్యాశాఖ అధికారుల చేత బహుమతులు పంపిణీ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ చేపట్టారు. తదుపరి విద్యార్థినిలు దేశభక్తి గీతాలు ఆలపిస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు చేశారు. విద్యాశాఖ అధికారులకు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు, పవన్‌లు ప్రజలకు క్షమాపణలు చెప్పాలి

## నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి



**బుచ్చిరెడ్డిపాళెం, మేజర్‌న్యూస్ :** తిరుపతి లడ్డుపై అసత్యప్రచారాలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు 'సిట్' నివేదికను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. శనివారం ఆయన నెల్లూరు పార్లమెంట్ పరిశలకులు జంకే వెంకటరెడ్డితో కలసి బుచ్చి పట్టణం లోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి స్థానంలో ఉండి, రాజకీయ లబ్దికోసం కోట్లాది మంది ఆరాధ్య దైవంగా కొలిచే వెంకటేశ్వర స్వామి వారి ప్రసాదంపై నోటికి వచ్చినట్లు మాట్లాడారని, వెంకటేశ్వరస్వామితో ఎవరైనా పెట్టుకుంటే నాశనమైపోతారన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లకు కూడా అదే గతిపడుతుందని శాపనార్థాలు పెట్టారు. దేవుని పేరు వాడుకొని వారిరువురు పూర్తిగా దిగజారిపోయారన్నారు. వైసిపికి కార్యకర్తలే బలం అన్నారు. వైసిపిలోకి వలసలు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈకార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి వీరి చలపతిరావు, కోవూరు నియోజకవర్గ పరిశీలకులు కొండూరు అనిల్ బాబు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## 93శాతం పెన్షన్ పంపిణీ : ఎంపీడీఓ



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగరం మండలంలో శనివారం గ్రామ సచివాలయాల పరిధిలోని ఎన్టీఆర్ భరోసా పెన్షన్ 93శాతం పంపిణీ చేశామని ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ పేర్కొన్నారు. సచివాలయ సిబ్బంది ఉదయం 7 గంటల నుండి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు అందరికీ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈరోజు పెన్షన్ పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బందితో, ప్రజాప్రతినిధులు స్థానిక నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొత్తం 6005 పెన్షన్లకు గాను 5610 పెన్షన్లు ఈరోజు పంపిణీ చేయడం జరిగింది. మిగిలిన వారికి రెండవ తేదీన పెన్షన్ పంపిణీ చేయడం జరుగుతుంది. కొత్తపల్లి గ్రామంలో జరిగిన పెన్షన్ పంపిణీని ఎంపీడీవో పరిశీలించారు.

# కూటమి ప్రభుత్వానికి కాకాణి సవాల్

● పచ్చ పత్రికల తప్పుడు కథనాలను ఖండించిన మాజీ మంత్రి కాకాణి




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలం మండల కేంద్రంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డా. కాకాణి గోవర్ధన్ రెడ్డి కూటమి ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. తనతో పాటు తన అనుచరులపై ?53 కోట్ల పెనాల్టీ విధించారంటూ కొన్ని తెలుగుదేశం పార్టీ అనుకూల పత్రికలు అసత్య కథనాలు ప్రచురించాయని, అందులో ఎలాంటి నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. చంద్రమోహన్ రెడ్డి ప్రోద్బలంతోనే ఈ తప్పుడు వార్తలు రాయించారని ఆరోపించారు.

**హైకోర్టు తీర్పుతో నోటీసుల రద్దు :** మైనింగ్ శాఖ జారీ చేసిన షోకాజ్, డిమాండ్ నోటీసులను హైకోర్టు పూర్తిగా కొట్టివేసిందని తెలిపారు. విజిలెన్స్ నివేదిక ఆధారంగా సరైన విచారణ లేకుండా జారీ చేసిన నోటీసులకు ఎలాంటి చట్టపరమైన విలువ లేదని కోర్టు స్పష్టం చేసిందన్నారు. ముందుగా ఆధారాలు ఇవ్వకుండా, వివరణ తీసుకోకుండా చర్యలు తీసుకోవడం సరికాదని హైకోర్టు ఆదేశించినట్లు తెలిపారు.

**గ్రావెల్ అక్రమాలపై ఆరోపణలు :** విజిలెన్స్ నివేదికలో చవ్వా చంద్రబాబు నాయుడు అక్రమంగా గ్రావెల్ తరలించినట్లు స్పష్టంగా ఉన్నప్పటికీ, అతడు టీడీపీకి చెందిన వ్యక్తి కావడంతో మైనింగ్ శాఖ నోటీసులు ఇవ్వలేదని ఆరోపించారు. జగన్ మోహన్ రెడ్డి జిల్లా పర్యటనలో కూడా ఇదే విషయాన్ని వెల్లడించారని గుర్తు చేశారు. చవ్వా చంద్రబాబు నాయుడు తన అనుచరుడని సోమిరెడ్డి చేస్తున్న ఆరోపణల్లో ఆధారాలు లేవని, అయితే సోమిరెడ్డి నిద్ర లేచినప్పటి నుంచి అతనితోనే ఉంటాడన్న ఆధారాలు ఉన్నాయని విమర్శించారు.

**కూటమి ప్రభుత్వంలో దోపిడీ మయం :** కూటమి ప్రభుత్వ హయాంలో గ్రావెల్, ఇసుక అక్రమ రవాణా విపరీతంగా జరుగుతోందని ఆరోపించారు. నాగం బోట్ల వారి కండ్రిగ, రామదాసు కండ్రిగ ప్రాంతాల్లో అనుమతులు లేకుండా వందల కోట్ల రూపాయల గ్రావెల్ తరలిస్తున్నారని తెలిపారు. ఇరిగేషన్ శాఖ అనుమతులు ఇవ్వలేదని చెప్పినా, మైన్స్ అండ్ జియాలజీ అధికారులు స్పష్టత ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారని అన్నారు.

**సోమిరెడ్డికి సవాల్ :** ఇరిగేషన్ పనులపై విజిలెన్స్ విచారణ జరిగిందని చెబుతున్న సోమిరెడ్డి ఆ నివేదికను బహిర్గతం చేయగలడా అని ప్రశ్నించారు. అవసరమైతే సీబీఐ విచారణకు సిద్ధమని, సోమిరెడ్డి కూడా సిద్ధమా అని సూటిగా సవాల్ విసిరారు.

**న్యాయవ్యవస్థపై నమ్మకం :** తాము ఎలాంటి తప్పు చేయలేదని, ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని డా. కాకాణి గోవర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా న్యాయస్థానాలపై పూర్తి నమ్మకంతో ధైర్యంగా ఎదుర్కొంటామని తెలిపారు. హైకోర్టు నోటీసులను వెంటనే కొట్టివేయడమే తమ వాదనకు నిదర్శనమని పేర్కొన్నారు. పచ్చ పత్రికలు ఎన్ని అసత్యాలు రాసినా భయపడబోమని, తప్పు చేయలేదు కాబట్టే ప్రజల ముందుకు వచ్చి వివరణ ఇస్తున్నామని ఆయన అన్నారు.

# కామాక్షి నిత్య హోమ పూజా కార్యక్రమాలు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి శనివారం ఉదయం జొన్నవాడ క్షేత్రము లోని శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానం నందు శ్రీ స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. జగద్గురు కంచి కామకోటి పీఠాధిపతులు వారి దివ్య ఆశీస్సులతో ఆలయంలో నూతనంగా ప్రతి రోజూ శ్రీ కామాక్షి నిత్య హోమం, ప్రతి మాసం బహుళ త్రయోదశి రోజున నందీశ్వరునికి ప్రదోష కాల పూజ కార్యక్రమం ప్రారంభించడం జరిగినదని, కశ్యపముని యజ్ఞం చేసిన ప్రదేశం యజ్ఞవాటిక కాలక్రమేణ జొన్నవాడగా పిలువబడుచున్న ఈ పుణ్యక్షేత్రం నందు ప్రతిరోజు హోమం చేయడం, త్రయోదశి రోజున నందీశ్వరునికి ప్రదోష సమయంలో అభిషేకం చేయడం అత్యంత పుణ్యప్రదం అని భక్తులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని శ్రీ స్వామి అమ్మవార్ల ఆశీస్సులు పొందవలసినదిగా కోరారు. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డి దేవస్థాన సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆలయ అర్చకులు అతిధులకు వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు నక్కల శివకృష్ణ, పెన్నత్తురు సుమలత, జొన్నలగడ్డ వరలక్ష్మి, కీలుకుప్ప శ్రీనివాసులు, ముంగర సుధాకర్, నాయకులు, ఆలయ అర్చకులు వేదపండితులు, సిబ్బంది, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే టీడీపీ ధ్యేయం



**జలదంకి, మేజర్‌న్యూస్ :** పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసమే టిడిపి ప్రభుత్వం పని చేస్తుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెన్షన్ల పంపిణీలో వృద్ధులకు మహిళలకు వితంతువులకు నాలుగు వేల రూపాయలు పెంచిన ఘనత దక్కుతుందని, టిడిపి పార్టీలోనే అది సాధ్యమని సోమశిల ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ పులుగుంట మధుమోహన్ రెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రమైన జలదంకిలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన నాగిరెడ్డి పాలెం గ్రామంలో ఫెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఫెన్షన్ దారులకు నగదు అందజేశారు. వృద్ధులకు మహిళలకు వితంతువులకు పెన్షన్లను ఒక్క రోజు ముందు గానే పంపిణీ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ స్వాగతిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదలైన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం భాగంగ గ్రామంలో ఇంటి వద్దకే వచ్చి, పెన్షన్ పంపిణీ చేశారు. పెన్షన్ లబ్ధి దారులతో మాట్లాడుతు చంద్రన్న ప్రభుత్వం ఎలా ఉంది, పెన్షన్‌ను సకాలంలో అందుతుందా ఎంత వస్తుంది మీ సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. గత ఐదు సంవత్సరాలలో వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి కుంటుపడిందని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సహకారంతో అభివృద్ధితో పాటు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు.

# ముంబైలో అధునాతన ముద్రణా రంగ యంత్రాల ప్రదర్శన

## ప్రింటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి.ఉమామహేశ్వరరావు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** అదునాతన ప్రింటింగ్ టెక్నాలజీకి సంబంధించిన యంత్రాల ప్రదర్శన ఐదు రోజులపాటు ముంబై నగరంలో జరిగిందని ప్రింటర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జి.ఉమా మహేశ్వరరావు శనివారం ముంబై నుండి ఒక ప్రకటనలో తెలియజేశారు. ముంబయి నగరంలోని ఎగ్జిబిషన్ సెంటర్ లో జనవరి 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు, భారతదేశంలోనే అతి పెద్ద ప్రింటింగ్ డిజిటల్, ప్యాకేజింగ్ యంత్రాల ప్రదర్శన జరిగిందని ఆ ప్రకటనలో వివరించారు. ఇందులో ప్రింటింగ్ టెక్నాలజీకి సంబంధించి డిజిటల్ ప్రింటింగ్ ప్యాకేజింగ్, ఇంకులు, కెమికల్స్, ఆధునిక ముద్రణా రంగ యంత్రాల ప్రదర్శన అందరినీ ఎంతగానో ఆకర్షించిందని తెలియజేశారు. అలాగే ఐదు రోజులపాటు జరిగిన ఈ అతిపెద్ద ప్రపంచ ఎక్స్‌పోలో భారతదేశంతోపాటు చైనా, జర్మనీ, జపాన్ దేశాల ప్రింటింగ్ రంగ నిపుణులు, అసోసియేషన్ నేతలు పాల్గొన్నారని తెలిపారు. ఈ ప్రదర్శనలో నెల్లూరు జిల్లా ప్రింటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గురవాలి ఉమామహేశ్వరరావు, కార్యదర్శి పీవీ. రమణారెడ్డి, ఉపాధ్యక్షులు కోటా రాంబాబు, జిల్లా కార్యవర్గం, ముద్రపాక సోదరులు పాల్గొన్నారని వెల్లడించారు.

# నూతన మేయర్ ఎంపిక పై వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలి

- కలెక్టరేట్ ఎదుట గిరిజన సంఘాల ఐక్యవేదిక రిలే నిరాహార దీక్ష
- పెద్ద ఎత్తున తరలివచ్చిన గిరిజన నేతలు, గిరిజన సంఘాలు, మహిళలు



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం గిరిజనుల హక్కులను కాలరాస్తోందని, దీనికి నెల్లూరు గత మేయర్ పొట్లూరి స్రవంతి పై అవిశ్వాస తీర్మానమే నిదర్శనమని గిరిజన సంఘాల ఐక్యవేదిక దుయ్యబట్టింది. నూతన మేయర్ ఎంపికపై వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం నెల్లూరు కలెక్టరేట్ ఎదుట ప్రముఖ న్యాయవాది, అంబేద్కర్ వాది, అంబేద్కర్ గిరిజన సంఘాల మహా కూటమి నాయకులు బాపట్ల వెంకటపతికి, గిరిజన సంక్షేమ సంఘం జిల్లా చైర్మన్ బివిల్ శేఖర్‌కి, గిరిజన నాయకులు తలపల జయవర్ధన్‌కి పూల మాలలు వేసి రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిజన నేతలు మహనీయులకు నివాళులర్పించారు. అనంతరం గిరిజన నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల హక్కులను కాల రాస్తుందని మండిపడ్డారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులు గతంలో ఎన్నడూ చూడలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థ మేయర్ స్థానాన్ని గిరిజనులకు దక్కకుండా కుట్ర జరుగుతోందని ఆరోపించారు. గిరిజనులు కేటాయించిన మేయర్ పదవిని ఇతర కులాలు ఎలా అనుభవిస్తాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆమరణ నిరాహార దీక్షకు సైతం పూనుకుంటామని జయవర్ధన్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు ఎండేటి సురేంద్ర, యాకసిరి మురళి, చేవూరు శ్రీనివాసమూర్తి గందల్ల రమేష్, ఏకుల సుబ్రహ్మణ్యం, కత్తి పద్మావతి, రచగిరి విజయమ్మ, పొట్లూరి కవిత, కొమరగిరి లక్ష్మి దళిత, గిరిజన సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొన్నాయి.

# కాంక్రీట్ వాల్ పనులను పరిశీలించిన చైర్ పర్సన్



**బుచ్చిరెడ్డిపాళెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిరెడ్డిపాళెం మునిసిపాలిటీ పరిధిలోని 4వ వార్డు బైపాస్ రోడ్డు ప్రాంతంలో 50లక్షల నుడా నిధులతో నూతనంగా నిర్మిస్తున్న గుడిపల్లి కాలువకు సంబంధించిన ఆర్‌సిసి కాంక్రీట్ వాల్ పనులను శనివారం వైస్ ఛైర్మన్ యరటపల్లి శివకుమార్ రెడ్డితో కలిసి మునిసిపల్ ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజా మురళి పరిశీలించారు. అదేవిధంగా బెజవాడ గోపాల్‌రెడ్డి పార్క్ సమీపంలో నిర్మిస్తున్న మునిసిపల్ నూతన కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. వీరివెంట కౌన్సిలర్ మల్లారెడ్డి, టిడిపి నాయకులు మోర్ల మురళి, కాంట్రాక్టర్ వెంకటశేషయ్య ఉన్నారు.

# ఫించన్లు పంపిణీ చేసిన కార్పొరేటర్ మహేష్ బాబు



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం 20వ డివిజన్ 20/1 సచివాలయం పరిధిలోని వనంతోపులో అర్హులైన పేదలకు 20వ డివిజన్ కార్పొరేటర్ చేజర్ల మహేష్ బాబు పెన్షన్లు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్లు మంజూరు చేయడం జరుగుతుందని సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఒకరోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు



**సీతారామపురం, మేజర్‌న్యూస్ :** మండలంలోని 14 పంచాయతీలలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు సీతారామపురం మండల కన్వీనర్ చింతల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఒకరోజు ముందుగానే అనగా శనివారం పింఛన్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీతారామపురం మెయిన్ బజార్, పండ్రంగి గ్రామాలలో మండల కన్వీనర్ చింతల శ్రీనివాసులు చేతుల మీదుగా పింఛన్ పంపిణీ కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, పనిచేసే ప్రభుత్వమని అన్నారు. ప్రజల పక్షాన ఎల్లవేళలా నిలిచే ప్రభుత్వం, ప్రజల శ్రేయస్సు లక్ష్యంగా పనిచేసే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కన్వీనర్ వెంగళ శెట్టి వెంకటేశ్వర్లు, మండల తెలుగు యువత అధ్యక్షులు పసుపులేటి వికాస్ బాబు, జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి తురక వెంకటేశ్వర్లు, మండల జనసేన నాయకులు భోగినేని కాశీ రత్తయ్య గాంధీ, పిన్ని బోయిన రమణయ్య, ఎస్సీ సెల్ నాయకులు జాషువా, తమ్మిశెట్టి రమణయ్య, కానాల సిద్ధయ్య, తోట ఏడుకొండలు, కాశి పోగు రాజేష్, బండి రవి తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి ఆనంను కలిసిన మధుమోహన్ రెడ్డి



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ జానకి రామలింగేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి కోసం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి వర్యులు శ్రీ ఆనం రామనారాయణ రెడ్డిని జలదంకి మండలం టిడిపి మాజీ కన్వీనర్, సోమశిల ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ పులుగుంట మధుమోహన్ రెడ్డి, దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ కూరపాటి దయాకర్ రెడ్డిలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు దేవస్థానంకి సంబంధించిన పలు అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వింతా సుబ్బారెడ్డి, పులుగుంట మహేంద్ర రెడ్డి, దగుమాటి శ్రీకాంత్ రెడ్డి, దేవరపల్లి రవిచంద్ర రెడ్డి, పులుగుంట మనోహర్ రెడ్డి, మరబోయిన నారాయణ, బీమవరపు తిరుపతయ్య, ఒంగోలు మాల్యాద్రి, ఒంగోలు మదన్, ఉప్పు ప్రసాద్ పాల్గొన్నారు.

# ఆనంతోనే సోమశిల గ్రామ అభివృద్ధి



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు నియోజకవర్గం ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తోనే సోమశిల గ్రామ అభివృద్ధి చెందుతుందని మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీ యోగు పెంచలయ్య పేర్కొన్నారు. శనివారం సోమశిల గ్రామంలోని అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు యోగు పెంచలయ్య మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి 16 కోట్ల రూపాయలతో సోమశిల అభివృద్ధి పనులు జరిగాయని అన్నారు. సోమశిల లో 30 పడకల ఆస్పత్రికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం చుట్టుపక్కల గ్రామ ప్రజల అదృష్టంగా భావిస్తున్నామన్నారు. సోమశిల గ్రామానికి అంతర్గత రోడ్లకు కోటి 30 లక్షల రూపాయలకు ప్రతిపాదనలు సిద్ధం చేశారని అన్నారు. మంత్రి ఆనం గ్రామంలోని త్రాగునీటి సమస్య కూడా పరిష్కారం చూపారన్నారు. సోమశిల అభివృద్ధి కాకుండా మండల అభివృద్ధికి మంత్రి ఎనలేని కృషి కృషి చేస్తున్నారన్నారు. సోమశిలలో పర్యాటకంపై మంత్రి ఆనం ప్రత్యేక దృష్టి పెట్టారని వివరించారు. సోమశిల రామాలయం అభివృద్ధికి ఐదు లక్షల రూపాయలు నిధులు మంజూరు చేశామన్నారు. సోమశిల అభివృద్ధికి సహకరిస్తున్న మంత్రి ఆనంకు కృతజ్ఞతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ముక్కు పుల్లయ్య గౌడ్, గ్రామ తెలుగుదేశం నాయకులు గువ్వల పెంచలయ్య, కొప్పాల నరసింహులు, పార్థసారథి నాయుడు, ముక్కు నాగరత్నం గౌడ్, సోమిశెట్టి సుబ్బారావు, మస్తాన్ భాష, వెంకటరమణ, బి మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

# జలదంకి శివాలయంలో ఘనంగా హిందూ సమ్మేళనం



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి శివాలయంలో హిందూ ధర్మ పరిరక్షణ, సంస్కృతి జాగృతి, జాతీయ భావన మరియు సమాజ ఐక్యత లక్ష్యంగా హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన హిందూ సమ్మేళనం అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సుమారు 250 మంది హిందూ బంధువులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో భాగంగా 8 భజన బృందాలు ఉత్సాహభరితంగా పాల్గొని, రామనామ స్మరణ, శివనామ స్మరణతో భజనలు చేస్తూ శివాలయ ప్రాంగణాన్ని భక్తి వాతావరణంతో నింపాయి. భజనలతో ఆలయ పరిసరాలు మార్మోగి, పాల్గొన్న భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యం వెల్లివిరిసింది. ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన =ూా ప్రముఖులు శ్రీ శేషా రెడ్డి మాట్లాడుతూ.. 'హిందూ' అనే పదానికి ఉన్న లోతైన అర్థాన్ని వివరిస్తూ, ఇద్దరితో ప్రారంభమైన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (=ూా) నేడు 100 సంవత్సరాలు పూర్తి చేసుకుని, దేశం, ధర్మం, సమాజం కోసం నిరంతర సేవలు అందిస్తున్న విధానాన్ని వివరించారు. దేశంలో జరుగుతున్న కొన్ని సంఘటనలు హిందువులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్నాయని, వాటిని హిందూ సమాజం గుర్తించి అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని స్పష్టంగా తెలియజేశారు. అదేవిధంగా వింజమూరు దుర్గాపీఠం నిర్వాహకులు శ్రీ భవానీ స్వామి మాట్లాడుతూ, హిందువులపై జరుగుతున్న దాడులు, బలవంతపు మతమార్పిడులు వంటి అంశాలను ప్రస్తావించారు. ముఖ్యంగా మహిళలు ధర్మరక్షణలో ముందుండాలని, 'ప్రతి మహిళ ఝాన్సీ రాణిలా ధైర్యంగా నిలవాలి" అంటూ మహిళలకు పిలుపునిచ్చారు. కార్యక్రమ నిర్వాహకులు వడ్డే శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ.. పొరుగు దేశాల కుట్రల వల్ల దేశ భద్రతకు ముప్పు ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం హిందువులనే లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న హింసాత్మక చర్యలను ప్రస్తావిస్తూ, ఇటీవల జమ్మూ-కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని ఉదాహరణగా పేర్కొన్నారు. హిందువు అనే కారణంతోనే ఏ విధమైన పాపం తెలియని అమాయకులను హతమార్చడం అత్యంత దారుణమని, ఇటువంటి ఘటనలకు ఎదురొడ్డి నిలవాలంటే హిందువులంతా ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం పాల్గొన్న భజన బృందాలను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలోసురే రామచంద్ర రెడ్డి, చింతం శ్రీనివాసులు రెడ్డి, ముడి కిశోర్ రెడ్డి, సురే చెంచురెడ్డి, గోసు ప్రసాద్, గోనుగుంట మధు, చిర్ర రాధాకృష్ణ రెడ్డి, దేవరపల్లి సుబ్బారెడ్డి, యదునందనరెడ్డి, శివరామిరెడ్డి, మణికంఠ, వంటేరు రాకేష్, బాలకోటయ్య, ప్రవీణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంతరాయ రహిత విద్యుత్ సరఫరా లక్ష్యం : అసిస్టెంట్ ఇంజనీరు కే.కుమార్



**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ, నెల్లూరు రూరల్ డివిజన్ ఆధీనంలో ఉన్న కావేరి నగర్ సెక్షన్ పరిధిలోని వినియోగదారులకు అంతరాయరహిత వాతావరణం మధ్య నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా ఎంచుకున్నట్లు అసిస్టెంట్ ఇంజనీర్ కే.కుమార్ తెలిపారు. శనివారం కావేరి నగర్ సెక్షన్ పరిధిలోని రెవెన్యూ వసూళ్లు, ట్రాన్స్ ఫార్మర్లు, కరెంటు తీగల స్థితిగతుల తోపాటు గృహ, వాణిజ్య, వ్యాపార, వ్యవసాయ రంగాలకు విద్యుత్ సరఫరా చేస్తున్న విధి విధానాలను పరిశీలించిన అసిస్టెంట్ ఇంజనీరింగ్ ఆయా ప్రదేశాల్లో ఎదురవుతున్న సమస్యలపై స్థానిక ప్రజలు వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కావేరి నగర్, సెక్షన్ పరిధిలో మొత్తం 39840 సర్వీసులు ఉన్నాయని, అందులో 28,000 సర్వీసులకు వివిధ కేటగిరీల కింద నెలసరి బిల్ డిమాండ్ కింద వస్తుందని, మిగిలిన 11840 సర్వీసులలో డిస్ కనెక్ట్ అయినవి, వివిధ కారణాలవల్ల సర్వీసులు తొలగించబడటంతో బిల్ స్టాప్ అయినవి ఉన్నాయన్నారు. అయితే ఏ నెలకు.. ఆనెలలో అవసరాలు, ఆయా సందర్భాలను బట్టి సర్వీసులు సంఖ్య పెరుగుతూ తగ్గుతూ ఉండటం వల్ల బిల్ డిమాండ్ కూడా స్థిరమైన సంఖ్య కాకుండా పెరుగుతూ తగ్గుతూ ఉంటుందన్నారు. వేసవి సీజన్ సమీపిస్తున్నందున విద్యుత్ వినియోగం కూడా ఎక్కువగా పెరిగే అవకాశం ఉందన్నారు. సాధ్యమైనంత వరకు విద్యుత్ వాడకంలో పొదుపు చర్యలు పాటించడం లాభదాయకమన్నారు. అదేవిధంగా విద్యుత్ వినియోగదారులకు అన్ని విధాల ఆదాయం చేకూర్చే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్తి యోజన పథకం వల్ల చేకూరే బహుళ ప్రయోజనాలపై క్షేత్రస్థాయి సదస్సులతో ప్రజలు, వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పిఎం సూర్యఘర్ పథకం కింద 25 సంవత్సరాలు వరకు గ్యారెంటీ ఉంటుందని, సోలార్ విద్యుత్ పలకలు ఏర్పాటు చేసుకున్న సామాన్య మధ్యతరగతి కుటుంబాలకు చెందిన లబ్ధిదారులకు కరెంటు ఆదాతోపాటు బిల్లు కూడా చాలావరకు తగ్గుతుందన్నారు. సౌర విద్యుత్ వినియోగదారులు ఉపయోగించుకున్న కరెంటులో మిగులు కరెంట్‌ను గ్రిడ్‌కు తిరిగి విక్రయించి ఆదాయం పొందే అవకాశం ఉంటుందన్నారు. దీనికి తోడు ఇళ్లపై సోలార్ పలకలు ఏర్పాటు చేసుకోవడం వల్ల ఇంటి లోపల భాగమంతా చల్లదనంతో నింపుతుందన్నారు. వేసవి సీజన్లో పెరుగుతూ పెరగనున్న విద్యుత్ వాడకం దృష్ట్యా డిమాండ్ కూడా రెండింతలు పెరిగే అవకాశం ఉన్నందున సాధ్యమైనంత వరకు ఇళ్లు, కార్యాలయాలు వ్యాపార సంస్థల్లో ఏసీల వినియోగం తగ్గించి ప్రత్యామ్నాయంగా కిటికీలు, తలుపులు తెలిసి ఉంచడం, లైట్లు ఫ్యాన్లు కూలర్లు ఇతర విద్యుత్ పరికరాలు అవసరమైన మేరకు వినియోగించడం వల్ల కూడా విద్యుత్ ను పొదుపు చేసే అవకాశం ఉంటుందన్నారు. కావేరి నగర్ సెక్షన్ పరిధిలోని సమస్యల పరిష్కారం తోపాటు నాణ్యమైన నిరంతర విద్యుత్ సేవలను అందించేందుకు సిబ్బందిని అందుబాటులో ఉంచడం జరిగిందని, నిత్యం ఫీడర్ల పరిధిలో ఉన్న ట్రాన్స్ఫార్మర్లు.. విద్యుత్ తీగల స్థితిగతులపై స్పెషల్ మానిటరింగ్ చర్యలతో పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడేందుకు విద్యుత్ తీగల కు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు, పోల్స్‌కు అల్లుకొని ఉన్న క్రీపర్లు, కేబుల్ వైర్లు పరోక్షంగా కారణమవుతున్నట్లు తెలిపారు. ఈ పరిస్థితుల్లో లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు, విద్యుత్ పోల్స్ కు అల్లుకొని ఉన్న క్రీపర్లు, స్తంభాలకు చుట్టబడి ఉన్న కేబుల్ వైర్లు, ఫ్లెక్సీల తొలగింపు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ప్రోత్సాహం, ఉన్నతాధికారుల మార్గదర్శకాలు, సిబ్బంది, ప్రజలు, రైతులు, వినియోగదారుల భాగస్వామ్యాలతో మరింత నాణ్యవంతమైన విద్యుత్ సేవలు అందించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

## కిమ్స్ హాస్పిటల్‌లో ప్రపంచ కుష్టు వ్యాధి దినోత్సవం




**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** ప్రపంచ కుష్టు వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజల్లో కుష్టు వ్యాధిపై అవగాహన పెంచే లక్ష్యంతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని కిమ్స్ హాస్పిటల్ నెల్లూరు నందు విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా కుష్టు వ్యాధి గురించి ఉన్న అపోహలను తొలగించడం, ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని ప్రజలకు, పేషేంట్లకు, పేషేంట్ అటెండర్లుకు వివరించారు. ఈ సందర్భంగా డెర్మటాలజిస్ట్, కాస్మెటాలజిస్ట్ డాక్టర్ షేక్. గులాబీ, సీనియర్ మైక్రో బయాలజిస్ట్ డాక్టర్ దీప్తి, సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ సి. కృష్ణమోహన్, తదితర వైద్య నిపుణులు మాట్లాడుతూ, కుష్టు వ్యాధి అంటువ్యాధి కాదని, సరైన చికిత్సతో పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప వైద్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో కుష్టు వ్యాధికి ఉచితంగా పరీక్షలు, చికిత్సలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా పోస్టర్ల ప్రదర్శన, కరపత్రాల పంపిణీ, ప్రజలతో ప్రత్యక్ష సంభాషణ నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమం ప్రజల్లో సానుకూల స్పందనను పొందిందని, కుష్టు వ్యాధి నివారణలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహద పడతాయని నిర్వాహకులు తెలిపారు.

## ప్రాథమిక పాఠశాల తనిఖీ



అనుమసముద్రంపేట మేజర్ న్యూస్ ఏఎస్పేట మండలం హసనాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఆత్మకూరు డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి జానకిరామ్ తనిఖీ చేశారు ఈ సందర్భంగా పాఠశాల యందు విద్యార్థులకు నిర్వహిస్తున్నటువంటి గ్యారేంటెడ్ ఫండమెంటల్ లెటర్సి అండ్ న్యూమరసి కార్యక్రమాన్ని పరిశీలించారు అలాగే ఫిబ్రవరి 15 తేదీ నాటికి నూరు శాతం గ్యారెంటెడ్ ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసి సాధించాలని తెలిపారు ఉపాధ్యాయులకు తగు సూచనలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పన్నులు సకాలంలో చెల్లించాలి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** మండలంలో పంచాయతీ పనులు సకాలంలో చెల్లించి ఆయా గ్రామ పంచాయతీల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఎంపీడీవో కే.శ్రీనివాస్ రెడ్డి డిప్యూటీ ఎంపీడీవో కే రామారావు కోరారు. శుక్రవారం బుక్కాపురం పంచాయతీలోని వసూలు చేస్తున్న ఇంటి పన్నుల పనితీరును పరిశీలించారు అనంతరం పంచాయతీ పరిధిలోని చిరాన్ కెమికల్ కర్మాగారం హెచ్ఆర్ సత్యను కలిసి చెల్లించాల్సిన కర్మాగార పనులను చెల్లించాలని కోరారు సానుకూలంగా స్పందించి త్వరలోనే చెల్లిస్తామని తెలిపారు. అంతేకాకుండా మండలంలో పారిశుధ్య నిర్వహణకు అవసరమైన డస్ట్ బిల్లులను అందించాలని కోరారు పరిశీలించి ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాములపాటి మాల్యాద్రి ఫ్యాక్టరీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## శ్రీవారి లడ్డుపై అసత్య ఆరోపణలు తిప్పి కొట్టిన వైసీపీ

**కావలి, మేజర్‌న్యూస్ :** గత వైసిపి ప్రభుత్వంలో వైఎస్ఆర్సిపి వ్యవస్థాపక అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తిరుమల తిరుపతి వెంకటేశ్వర దేవస్థానములో అతి ముఖ్యమైన దేవుని ప్రసాదమైన లడ్డును అపవిత్రము చేసినదంటూ ప్రచార మాధ్యమాలలో విస్తృతంగా కూటమి ప్రభుత్వం ప్రచారం చేయడం ఆ తర్వాత ఎంక్వైరీకి సిట్‌ను వేయడం అంతా జరిగిపోయింది. అయితే కావలి పట్టణంలో కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం ఉదయం స్థానిక కచ్చేర మిట్ట వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో కావలి వైసిపి పట్టణ నాయకులు పూజలు నిర్వహించి మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు, కూటమి ప్రభుత్వం వైసిపి ప్రభుత్వం పై అసత్య ఆరోపణలు చేస్తూ కాలం గడుపుకుంటున్నారని గతంలో కూటమి ప్రభుత్వం చేసిన ఆరోపణలు అసత్యమని ఈరోజు తెలియజేయడం జరిగిందని వారు తెలిపారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం కండ్లు తెరవాలని ఆ దేవుడు మంచి మనసును వాళ్లకు కలుగజేసి మరల జీవితంలో ఇటువంటి అసత్య ఆరోపణలు చేయకూడదని వారు కోరారు. రాబోయే ప్రభుత్వం వైసిపి ప్రభుత్వం మేనని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి పట్టణ వైసీపీ నాయకులు, వార్డు కౌన్సిలర్లు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నెల్లూరు రూరల్‌కు ఎంత చేసినా తక్కువే.. రూరల్ ఎమ్మెల్యే

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని హరినాథపురం జంక్షన్ వద్ద 3.50 కోట్లతో నెల్లూరు-కృష్ణపట్నం పోర్టు రోడ్డుకు శనివారం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాజీ మేయర్ నంది మండలం భానుశ్రీలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. గతంలో 42 కోట్లతో 339 అభివృద్ధి పనులకు ఏ విధంగా పూర్తిచేశామో ఇప్పుడు అదే విధంగా 27 కోట్లతో 240 అభివృద్ధి పనులను పూర్తి చేస్తాం అని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. నేను అందుబాటులో లేకున్నా రూరల్ నియోజకవర్గం లో ఉన్న కార్యకర్తల బృందం కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి అందరూ కలిసి 240 అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు అని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఎన్నికలు ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజల్లోనే ఉంటాం ప్రజా



సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తాం అని అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందే విధంగా చూస్తాం అనిరూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. పై కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జిలు, డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కొవ్వు అబద్ధం.. కుట్ర నిజం : మాజీ మంత్రి కాకాణి



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదంపై గత కొంతకాలంగా జరిగిన అసత్య ప్రచారాలు, ఆధారరహిత ఆరోపణలు పూర్తిగా అబద్ధాలని కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ నివేదికతో తేటతెల్లమైంది. ఈ నేపథ్యంలో సత్యం గెలిచినందుకు కృతజ్ఞతగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధనరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్వేపల్లి నియోజకవర్గం, వెంకటాచలం మండలం కసుమూరు గ్రామంలోని శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో భక్తులతో కలిసి డా. కాకాణి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మనసు మారాలని ఆలయంలో 101 టెంకాయలు కొట్టి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిన తిరుమల దేవస్థానం మన రాష్ట్రంలో ఉండటం మన అదృష్టమన్నారు. సెప్టెంబర్ 18, 2024న చంద్రబాబు నాయుడు గత ప్రభుత్వం పై రాజకీయ లబ్ధి కోసం లడ్డు తయారీలో జంతువుల కొవ్వు కలిపారని చేసిన ఆరోపణలు పూర్తిగా అబద్ధాలని సీబీఐ విచారణలో తేలిందన్నారు. లడ్డు వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరగా, బాధ్యతాయుతమైన పదవిలో ఉండి నిజానిజాలు నిర్ధారణ కాకముందే వ్యాఖ్యలు చేయడంపై కోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎస్ఐటీపై నమ్మకం లేదని పేర్కొన్న ధర్మాసనం, రాజకీయాలకు అతీతంగా నిష్పక్షపాత విచారణ జరగాలనే ఉద్దేశంతో సీబీఐని దర్యాప్తులో భాగస్వాములను చేయాలని ఆదేశించిందన్నారు. సుదీర్ఘ విచారణ అనంతరం లడ్డు ప్రసాదంలో ఎలాంటి జంతువుల కొవ్వు గానీ, ఇతర కల్తీలు గానీ జరగలేదని సీబీఐ స్పష్టంగా నిర్ధారించి చార్జ్‌షీట్ దాఖలు చేసిందన్నారు. దీంతో లడ్డు విషయంలో అబద్ధం ఓడి, నిజం గెలిచిందని భక్తులు భావిస్తున్నారని చెప్పా రు. చంద్రబాబు, పవన్ చేసిన వ్యాఖ్యలు మతసామరస్యాలకు విఘాతం కలిగించేలా ఉన్నాయని, కోట్లాది భక్తుల మనోభావాలను దెబ్బతీశాయని కాకాణి విమర్శించారు. తిరుమల దేవస్థానం అన్ని కులాలు, మతాలకు చెందిన భక్తులకు ఐక్యతకు ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. చివరగా, అబద్ధపు ప్రచారంతో శ్రీవారి ప్రతిష్టను దెబ్బతీయాలన్న కుట్రలు విఫలమయ్యాయని, వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో సత్యం నిలిచిందని డా. కాకాణి తెలిపారు.

# విజయవంతంగా రోడ్ సేఫ్టీ అవగాహన వాక్ నిర్వహణ

**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వం వారు రోడ్ సేఫ్టీ అవేర్నెస్‌లో భాగంగా జనవరి 1, 2026 నుండి జనవరి 31, 2026 వరకు జరుగుతున్నటువంటి కార్యక్రమంలో శనివారం ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు రోడ్ సేఫ్టీ అవగాహన వాక్‌ను సుమారు 1000 మందితో సర్వోదయ కాలేజీ నుండి గాంధీ బొమ్మ సెంటర్ మీదుగా విఆర్‌సి గ్రౌండ్ వరకు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమీషనర్ చందర్, అడిషనల్ ఎస్పీ సౌజన్య, డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస రావు, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ వి.సుజాత, అడిషనల్ డిఎంహెచ్ ఖాదర్ వలి, ఏసిఎస్ఆర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజేశ్వరి, సూపరింటెండెంట్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ డాక్టర్ కె.మాధవి, కిమ్స్ హాస్పిటల్ నెల్లూరు వారి తరుపున డాక్టర్ సివిఎస్ శ్రీనివాసరాజు, డాక్టర్ కే.బాలకొండయ్య, న్యూరో సర్జన్ డాక్టర్ సి.కృష్ణమోహన్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు రోజురోజుకీ పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని పిలుపునిచ్చారు. కిమ్స్ హాస్పిటల్



సిబ్బంది, బొల్లినేని నర్సింగ్ కాలేజీ విద్యార్థులు, నారాయణ మెడికల్ కాలేజ్, ఫార్మా కాలేజ్, నర్సింగ్ కాలేజ్ విద్యార్థులు, స్వాతి నర్సింగ్ కాలేజ్ విద్యార్థులు, గీతాంజలి ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థులు, వెంకటేశ్వర ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని రోడ్డు భద్రత సందేశాలను ప్లకార్డుల ద్వారా ప్రజలకు చేరవేశారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని, రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ చైతన్యవంతులవ్వాలని ఈ అవగాహన వాక్ ద్వారా తెలియజేశారు.

## గుడి పూజారి కళ్యాణ్ స్వామికి సత్కారం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి గ్రామ దేవత కలుగోలమ్మ గుడిలో పూజారి స్వామి బిండి కళ్యాణ్ కుమార్ ఆచార్యులకు గౌరవ డాక్టరేట్ పట్టా లభించిన సందర్భంగా వారిని అభినందిస్తూ శుక్రవారం సాయంత్రం హిందూ ధార్మిక వాదులు మొగలపల్లి రాజా, గునుపూడి సుబ్బరాయుడు, అమ్మా చారిటబుల్ ట్రస్ట్ నున్న మురళి సీనియర్ జర్నలిస్ట్ జయప్రతాప్ రెడ్డిలు వారిని ఘనంగా సత్కరించారు. యోగ సాంస్కృతిక యూనివర్సిటీలో ఎంఏపీహెచ్డీ పూర్తి చేసిన క్రమంలో ఆయనకు డాక్టరేటా పట్టా లభించడం అభినందనీయమని వారు తెలిపారు. ఆలయంలో పూజారి గానే కాకుండా రాష్ట్రంలోనే వివిధ ప్రాంతాలకు చెందిన బాల పురోహితులకు తన నివాసములో తమ్ముడు శ్రీకాంత్తో కలిసి శిక్షణ తరగతులను నిర్వహిస్తూ, ఎంతోమంది పండితులను కళ్యాణ్ ఆచార్యులు తీర్చిదిద్దుతున్నారని మంచి వాగ్దాటి కలిగిన కళ్యాణ్ స్వామి భవిష్యత్తులో ఎందరికో మార్గదర్శకం కావాలని ఈ సందర్భంగా వారిని అభినందించారు. వేదాంగ జ్యోతిష్యంలోనూ పట్టు సాధించిన కళ్యాణ్ ఆచార్యులు డాక్టర్ కళ్యాణ్ స్వామి కావడం పట్ల వారు హర్షాన్ని వ్యక్తం చేశారు.

## 37వ డివిజన్‌లో ఎన్టీఆర్ భరోసా పంపిణీ



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరులోని 37వ డివిజన్‌లో కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని నెల్లూరు జిల్లా జనసేన పార్టీ సీనియర్ నాయకులు, మున్సిపల్ కార్పొరేషన్ కో-ఆప్షన్ సభ్యులు నూనె మల్లికార్జున యాదవ్, కూటమి టీడీపీ సీనియర్ నాయకులు కిలారి తిరుపతి నాయుడు, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి, 37వ డివిజన్ ఇన్‌చార్జ్ షేక్ షానవాజ్, చంటిబాబు అధ్యక్షతన నిర్వహించారు. రేపు ఆదివారం కావడంతో ఎక్కడా పెన్షన్లు ఆగకూడదన్న కూటమి ప్రభుత్వ ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ ఉదయం 7:00 గంటల నుండిఎంతో శ్రద్ధతో పెన్షన్ల పంపిణీ ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా నిరుపేద వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పెన్షన్లు ఇంటి వద్దకే అందించి వారికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ, టీడీపీ, బీజేపీ నాయకులు ఫయాజ్, రెహ్మాన్, పుల్లయ్య, ఫాహద్ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఈనెల 7వ తేదీ కౌన్సిల్ సమావేశం

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ సర్వసభ్య ప్రత్యేక సమావేశం ఈనెల 7వ తేదీ ఉదయం 10:30 గంటలకు నగరపాలక సంస్థ కార్యాలయంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సమావేశ మందిరం నందు ఇన్‌చార్జ్ మేయర్ అధ్యక్షతన జరగనుంది. సర్వసభ్య సమావేశం సంబంధించి అధికారులు తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

## బలిజ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

**కావలి, మేజర్‌న్యూస్ :** బలిజ ఉద్యోగుల అభ్యుదయ సేవా సమితి 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి వారి గృహంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బలిజ ఉద్యోగుల అభ్యుదయ సేవ సమితి గౌరవ సలహాదారులు పాపిశెట్టి జానకిరామ్ ప్రెసిడెంట్ నాగిశెట్టి శ్రీనివాసరావు సెక్రెటరీ బండి కోటి చలపతిరావు, ట్రెజరర్ నాగిశెట్టి వెంకట సతీష్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నలంద స్కూల్ సైన్స్ ఫెయిర్ కార్యక్రమం



**కావలి, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని స్థానిక కోపరేటివ్ కాలనీలో నలంద స్కూల్లో సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కళాశాల ఉపాధ్యాయులు విద్యార్థినులు ఘనంగా స్వాగతం పలికారు అనంతరం. ఎమ్మెల్యే కావ్య కొద్దిసేపు జరిగిన సైన్స్ వేర్ కార్యక్రమాన్ని తిలకించి విద్యార్థులను ఎగ్జిబిషన్ కు ప్రదర్శించిన పనిముట్ల సామాగ్రి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారిని అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు ఎదిగి సమాజానికి గౌరవం తీసుకురావాలని వారిని నమ్మి కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రులకు మంచి పేరు వచ్చేలా క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. పిల్లలలో ఉన్న మేధాశక్తిని మోటివేషన్స్ వెలికి తీసే విధంగా ప్రతి విద్యార్థి ముందుకు వెళ్లాలని రానున్న ఏఐ టెక్నాలజీని మరిపించే విధంగా ప్రజలు సిద్ధపడాలని తెలిపారు. సైన్స్ ఫెయిర్ కార్యక్రమం పాఠ్య పుస్తకాలలోని పాటాలు కాకుండా జనరల్ నాలెడ్జిలో కూడా ముందుండి ఇటువంటి కార్యక్రమాలు వలన విద్యార్థులకు ఎంతో ముందు చూపులు కలిగిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 300 స్టాల్స్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. వినేదానికంటే చూసి నేర్చుకుంటేనే నిజమైన జ్ఞానం పెరుగుతుందని విద్యార్థులు ఒకరినొకరు పాఠ్యాంశాలను చర్చించుకోవడం వలన జ్ఞానం కూడా పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నలంద స్కూల్ డైరెక్టర్ వసీం, ప్రిన్సిపాల్ ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు సిబ్బంది తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# నెల్లూరు నగర రూపురేఖలు మార్చడమే లక్ష్యం

- రోడ్ల మరమ్మతులు, కాలువల ఆధునీకరణపై కీలక ఆదేశాలు
- పార్కుల సుందరీకరణ, ఎండ్-టు-ఎండ్ రోడ్ల నిర్మాణంపై మంత్రి నారాయణ ప్రత్యేక దృష్టి




**నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పని చేయాలని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. శనివారం చింతారెడ్డి పాలెంలోని క్యాంప్ కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అందులో భాగంగా చేపట్టిన ఎండ్-టు-ఎండ్ రోడ్ల నిర్మాణం, పెండింగ్‌లో ఉన్న రోడ్డు ప్యాచ్ వర్క్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు నగరవ్యాప్తంగా భారీగా చెట్లు నాటే కార్యక్రమాన్ని చేపట్టడంతో పాటు, పార్కుల పునరుద్ధరణ, కాలువల ఆధునీకరణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామన్నారు. అభివృద్ధి పనుల పర్యవేక్షణలో కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాలని, ప్రభుత్వ ఆశయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తూ, నగరాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షలో మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు ధర్మవరపు సుబ్బారావు, నగర పార్టీ అధ్యక్షులు మామిడాల మధు, కార్పొరేటర్లు, డివిజన్ ప్రెసిడెంట్లు, క్లస్టర్ ఇన్‌చార్జీలు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# నెల్లూరులో మొంత్రా ఎలక్ట్రిక్ మంచినీటి ట్యాంకర్ సందడి



- పర్యావరణ హితం.. ప్రజలకు అమృతం
- కాలుష్యం లేకుండా ఇంటింటికీ మంచినీటి సరఫరా
- ఇరుకైన వీధుల్లోనూ సులభంగా తాగునీరు అందించేలా వినూత్న ప్రయోగం
- ట్రాక్టర్ ఎక్కిన మంత్రి

**నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :** నగర ప్రజల తాగునీటి అవసరాలను తీర్చే క్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ మరో కీలక అడుగు వేసింది. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని, అత్యాధునిక సాంకేతికతతో రూపొందించిన 'మొంత్రా ఈ-ట్రాక్టర్' మంచినీటి ట్యాంకర్ వాహనాన్ని రంగనాయకులపేటలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ జెండా ఊపి శనివారం ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం మంత్రి నారాయణ స్వయంగా డ్రైవర్ సీటులో కూర్చుని, వాటర్ ట్యాంకర్ అనుసంధానించిన ఈ-ట్రాక్టర్‌ను నడిపి అందరినీ ఉత్సాహపరిచారు. శబ్దం, పొగ లేని ఈ విద్యుత్ వాహనం ద్వారా నగరంలోని ఇరుకైన సందుల్లో సైతం ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మంచినీటిని సరఫరా చేయవచ్చని మంత్రి పేర్కొన్నారు. సుమారు ?12 లక్షలతో ఈ ఎలక్ట్రిక్ ట్రాక్టర్‌ను కొనుగోలు చేశారన్నారు. ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే 60 కిలోమీటర్ల వరకు ప్రయాణించి నీటిని సరఫరా చేస్తుందన్నారు. డీజిల్ ఖర్చు ఉండదు కాబట్టి నగరపాలక సంస్థపై ఆర్థిక భారం తగ్గుతుందని, నెల్లూరును 'క్లీన్ అండ్ గ్రీన్' సిటీగా మార్చడంతో పాటు, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయం అని సాంకేతికతను సామాన్యుడి చెంతకు చేర్చి, నెల్లూరు నగరపాలక సంస్థను రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలబెడతామని ఈ సందర్భంగా మంత్రి నారాయణ తెలియజేశారు.

# నేత్రపర్వంగా జగన్నాథ రథయాత్ర

- భక్తజన సంద్రమైన నగర వీధులు
- జెండా ఊపి రథయాత్రను ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే




**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** ఆధ్యాత్మిక నగరి నెల్లూరులో 13వ జగన్నాథ రథయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. ఇస్కాన్ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే ఈ భారీ శోభాయాత్ర, ఈ ఏడాది కూడా భక్తుల కోలాహలం మధ్య కన్నుల పండువగా సాగింది. 31వ తేదీన నగరం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

**ఘనంగా ప్రారంభమైన శోభాయాత్ర**

శనివారం మధ్యాహ్నం 4 గంటల సమయంలో నెల్లూరు కలెక్టర్ ఆఫీస్ సెంటర్ వద్ద ప్రత్యేక పూజలతో రథయాత్ర ప్రారంభమైంది. జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర దేవి విగ్రహాలను అత్యంత సుందరంగా అలంకరించిన భారీ రథంపై కొలువుదీర్చారు. ఇస్కాన్ ప్రతినిధులు, హెచ్‌జి ఇంద్రానుజ దాస్, ఆలయ అధ్యక్షుడు అమృతసర్, హెచ్‌జి వేణు కృష్ణ దాస్, మైసూర్, హెచ్‌జి మహాశృంగ దాస్, సికింద్రాబాద్, డాక్టర్ హరే కృష్ణ దాస్, తెలంగాణ హెచ్‌జి అమియా నిమై దాస్, యుపి ముజఫర్ నగర్, కరుణా సింధ్ దాస్ (రూప్నీ) ప్రముఖులు రథం ముందు బంగారు చీపురుతో ఊడ్చి 'చేరా పహారా' కార్యక్రమాన్ని నిర్వహించారు. 'జై జగన్నాథ్.. హరే కృష్ణ' నినాదాలతో నగర వీధులు మార్మోగాయి.

**భక్తుల కోలాహలం – ఆధ్యాత్మిక పరవశం**

వేలాది మంది భక్తులు రథం తాళ్లను లాగేందుకు పోటీ పడ్డారు. జగన్నాథుడి రథాన్ని లాగడం కోటి జన్మల పుణ్యఫలమని భక్తుల నమ్మకం. మార్గమధ్యంలో ప్రజలు తమ ఇళ్ల ముందు రథానికి హారతులు ఇచ్చి, స్వామివారికి పండ్లు, నైవేద్యాలు సమర్పించారు. విదేశీ కృష్ణ భక్తులు సైతం ఈ యాత్రలో పాల్గొని భజనలు చేస్తూ, నృత్యాలు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యాత్ర పొడవునా భజన బృందాల కీర్తనలు, కోలాట ప్రదర్శనలు ప్రజలను మంత్రముగ్ధులను చేశాయి.





**భారీ బందోబస్తు.. సాఫీగా సాగిన యాత్ర**

భక్తులు భారీగా తరలి రావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ మళ్లించి యాత్ర సాఫీగా సాగేలా చర్యలు తీసుకున్నారు. ఇస్కాన్ ప్రతినిధులు భక్తులకు భారీగా ప్రసాద వితరణ చేశారు.

**యాత్ర సాగిన మార్గం**

కలెక్టర్ ఆఫీస్ నుంచి మొదలైన ఈ యాత్ర బారకాసు, పెద్ద బజారు, చిన్న బజార్, ములుమూడి బస్టాండ్, సంతపేట, ఏసీ బొమ్మ, గాంధీ బొమ్మ, విఆర్సి, కూరగాయల మార్కెట్, ఆర్టీసీ బస్టాండ్,కెవిఆర్ పెట్రోల్ బంక్, యంజి మాల్ మీదుగా ప్రయాణించి టీటీడీ కల్యాణ మండపం వద్ద ముగిసింది.

# కుటమి నేతలు ఇకనైనా మారండి..

- జలదంకి వైసిపి నేతల హితవు



**జలదంకి, మేజర్‌న్యూస్ :** లడ్డు విషయంలో కూటమినేతలు ఇకనైనా మారాలని, సుప్రీంకోర్టు తీర్పు కూటమీ పార్టీలకు సరైన గుణపాఠమని జలదంకి మండలం వైసీపీ నేతలు స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు వైసీపీకి అనుకూలంగా రావడంతో మండలం వైసిపి నేతలు జలదంకి చెన్నకేశవ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ మదన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. కూటమి నాయకులు ఆఖరకు వెంకటేశ్వర స్వామి లడ్డును కూడా వదిలిపెట్టలేదని అన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డిపై, వైవి సుబ్బారెడ్డి పై వచ్చిన ఆరోపణలు నిజం కావని న్యాయస్థానమే చెప్పిందని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. కూటమి పార్టీల పాలన బాగాలేదని విషయాన్ని ప్రజలు గుర్తిస్తున్నారని, పక్కదారి పట్టించడానికి లడ్డు ఆరోపణ అన్నారు. ఇకనైనా బుద్ధి మార్చుకుని పాలనపై దృష్టి పెట్టాలని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసి శివ లీలమ్మ, వైసిపి నాయకులు సూరే వెంకట శేషారెడ్డి, గుర్రం జగ్గయ్య నాయుడు, కోర్సు పార్టీ రామిరెడ్డి, వాక మహదేవ్ రెడ్డి, రఘురామిరెడ్డి, రవి రెడ్డి, దేవరపల్లి మధుసూదన్ రెడ్డి, తమ్మినేని సతీష్ బాబు, కమతం సుబ్బారావు, ఆదిన శ్రీనివాసులు, మాల్యాద్రి, బాబుల్ రెడ్డి, గద్దిగుంట రవి, బ్రహ్మారెడ్డి, పేతురు, వల్లంరెడ్డి జగదీశ్‌రెడ్డి, రామాల రమేష్‌రెడ్డి, వంటేరు లక్ష్మీనరసారెడ్డి, మండలంలోని వైసిపి నాయకులు, పాల్గొన్నారు.

# రాజకీయ లబ్ధి కోసమే శ్రీవారి లడ్డుపై కుట్రలు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వస్వామి సన్నిధిలో జరిగిన లడ్డు విషయంలో విష ప్రచారం చేసిన కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు లాగా సిబిఐ, ఛార్జ్ షిట్ ఇచ్చిన నివేదికలో జంతు కొవ్వులు లేవని కోర్టుకు తెలిపిందిఅందులో భాగంగానే ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు ఉదయగిరి పట్టణం లోని శ్రీ అభయాంజనేయ దేవస్థానం లోని శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో మండల కన్వీనర్ కొండా రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామి సన్నిధిలోని మెట్లను సుబ్రపరిచి కొబ్బరికాయలు కొట్టి,ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి లడ్డు ప్రసాదంలో కల్తీ జరిగిందని ఆరోపణలు అవాస్తమని అంటూ వైఎస్ఆర్సిపి నాయకులు తెలిపారన్నారు. కూటమి ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసమే లడ్డు పై కుట్రలకు తెర లేపిందన్నారు. దేవుళ్ళు, పై మతాలపై విష ప్రచారాలు చేయడం సిగ్గుచేటన్నారు. నిలకడగా సత్యం ఎప్పుడు గెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.తిరుపతిరెడ్డి, చెన్నయ్య, శ్రీనివాసులు రెడ్డి, కృష్ణారెడ్డి, నారాపారెడ్డి రామిరెడ్డి, గౌసేమొహిద్దీన్, దస్తగిరి అహమ్మద్, ఎంపి సలీం, గురవయ్య, పెంచలయ్య, నానాజీ, గోవిందు, రమణయ్య, సిద్దు తిరుపతిరెడ్డి, సాామ్రాట్, నారాయణరెడ్డి, జనార్దన్‌రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కావలి సబ్ జైల్లో న్యాయవిజ్ఞాన సదస్సు




**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో స్థానిక సబ్ జైలు ఆవరణంలో న్యాయవాది ఐ.సాయిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీనియర్ సివిల్ జడ్జ్ ఎ.గీతా వాణి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని తెలిసో, తెలియకో ప్రతి మనిషి తప్పు చేస్తారని తప్పు చేసిన తర్వాత తన తప్పును తెలుసుకొని పరివర్తన చెంది జైలు నుంచి విడుదల అయిన తర్వాత జన జీవన ప్రవంతిలో కలిసిపోయి ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకొని జీవన విధానాన్ని సాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాలకొండ రెడ్డి జైలు సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.

## వివక్షతను అంతం చేయడం..

# రోగుల గౌరవాన్ని కాపాడటమే !

### టిహెచ్ వార్డ్ వైద్యాధికారిణి డాక్టర్ శాలిని - ఏపీ గిరిజన బాలికల గురుకులంలో కుష్టు వ్యాధి నివారణపై అవగాహన సదస్సు

**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** జిల్లా కేంద్రమైన నెల్లూరు నగరంలోని పొదలకూరు రోడ్డు వాటర్ ట్యాంక్ పక్కన ఉన్న ఏపీ గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో శనివారం ఎస్ఎల్ఏసి (స్పర్శ్ లేప్రోజీ అవేర్నెస్ కాంపెయిన్) కార్యక్రమంలో భాగంగా "కుష్టు వ్యాధి"పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దాదాపు 170 మంది బాలికలకు కుష్టు వ్యాధి లక్షణాలు, చికిత్స గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న టిహెచ్ వార్డ్ వైద్యాధికారిణి డాక్టర్ శాలిని మాట్లాడుతూ.. ఈ ఏడాది జనవరి 30 నుంచి ప్రారంభించిన అవగాహన సదస్సులు ఫిబ్రవరి 13 వరకు మొత్తం 14 రోజులపాటు గ్రామ గ్రామాన కుష్టు వ్యాధి గురించి అవగాహన



కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామీణ ప్రాంతాన్ని కుష్టు రహిత గ్రామంగా ఏర్పాటు చేయవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ కుష్టు రోగులు పట్ల వివక్షత చూపకుండా.. వారిని గౌరవించడం ద్వారా సమ సమాజం స్థాపనకు పాటుపడ్డారని, అదే స్ఫూర్తితో మనం కూడా వివక్షతను అంతం చేసి కుష్టు రోగులను గౌరవించడం నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డీపీఎంఓ సుబ్బయ్య, గిరిజన సంక్షేమ పాఠశాల హెడ్ మాస్టర్ మేరీ ప్రీతం.. కుష్టు వ్యాధి నిరోధక శాఖ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## యుద్ధకళ పోటీలో ఆత్మకూరు విద్యార్థికి జాతీయస్థాయి బంగారు పథకం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో 3 రోజులపాటు జరిగిన పెన్కాక్ సిలాట్ యుద్ధకళ నేషనల్ ఛాంపియన్షిప్ పోటీలో జాతీయస్థాయి బంగారు పథకం సాధించిన ఆత్మ కూరుకు చెందిన 7వ తరగతి విద్యార్థి సయ్యద్. మొహిద్దిన్ ఖాదరిని పలువురు అభినందించారు. ఆత్మకూరు పట్టణంలోని జెఆర్ పేట ప్రాంతంలో నివసిస్తున్న మొహిద్దిన్ ఖాదిరి ఆత్మకూరులోని మేధా ఇంగ్లీష్ మీడియం స్కూల్లో 7వ తరగతి చదువుతున్నాడు. బాలుని తండ్రి సయ్యద్ జమీర్ అప్పారావుపాలెం హైస్కూల్‌లో స్కూల్ కార్యాలయ సిబ్బందిగా



విధులు నిర్వహిస్తున్నారు. బాలుడు ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన పెన్కాక్ సిలాట్ రాష్ట్రస్థాయి పోటీలో బంగారు పతకం సాధించిన అనంతరం జాతీయస్థాయిలో డెహ్రాడూన్‌లో జరిగిన పోటీలో బంగారు పతకం సాధించాడు. ఏపీ నుండి పోటీలలో పాల్గొన్న ఈ విద్యార్థి బంగారు పథకం సాధించాడు. ఇదే పోటీలలో మరో విభాగంలో ఆత్మకూరుకు చెందిన షేక్.మహమ్మద్ అనీఫ్ అనే 9వ తరగతి చదివే విద్యార్థి సిల్వర్ పథకం సాధించాడు.

## నిఘా నీడలో ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** జిల్లాలో ఆదివారం నుంచి జరగనున్న ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు కోవూరు కళాశాల ప్రిన్సిపాల్, పరీక్షల నిర్వహణ జిల్లా కమిటీ సభ్యులు సికిందర్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ, ఎంవీఆర్ జూనియర్ కళాశాలలను సందర్శించి ల్యాబ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 160 కేంద్రాల్లో సుమారు 20 వేల మంది విద్యార్థులు ఈ పరీక్షలను రాస్తున్నారన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. పరీక్షల సమయంలో విద్యార్థి ప్రతి కదలికను సీసీ కెమెరాల్లో ఆర్వో, ఇంటర్ బోర్డు కార్యాలయాల్లో పర్యవేక్షిస్తుంటారన్నారు. ల్యాబ్లో 20 మంది విద్యార్థులు ప్రయోగ పరీక్షలు చేస్తారన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి విద్యార్థులకు సీబీఎస్ఈ సిలబస్ అమలవుతుంద న్నారు. అనంతరం అధ్యాపకులు తగు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిని పరామర్శించిన కొండా



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** గండిపాలెంలో వైయస్సార్‌సీపీ సీనియర్ నాయకులు రాపల్లి తిరుపతికి శత్ర చికిత్స చేయించుకొని ఇంటికి వచ్చారని తెలుసుకొన్న కన్వీనర్ కొండా రాజగోపాల్ రెడ్డి శనివారం గండిపాలెంలోని అతని నివాసానికి వెళ్లి పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకొని ధైర్యం చెప్పారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయనతోపాటు తిరుపతి రెడ్డి, నారాయణ రెడ్డి, గురవయ్య, పెంచలయ్య, సామ్రాట్, నానాజీ, చెన్నయ్య, రియాజ్, బాషా తదితరులు ఉన్నారు.

## రైతులకు అందుబాటులో యూరియా

**సైదాపురం, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయలంలోని ఎరువులను మండల వ్యవసాయ అధికారి హైమావతి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మండలంలో రైతులకు యురియా కొరత ఉండదని, కావలసిన వారు యురియా తీసుకోవచ్చన్నారు. రైతులంద రు కూడా ఒక చిన్న విషయం గమనించాలని, ప్రతి రైతు కూడా



వారి పొలం బుక్ మీద ఏచోటైనా యూరియాను తీసుకున్నట్లయితే రైతు ఆధార్ నంబరు ఎంటర్ చేయగానే ఆ రైతు పొలంపై ఎన్ని యూరియా కట్లు తీసుకున్నారన్న విషయం తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రతి రైతు దగ్గర నుండి ఆధార్ నంబర్ ఎంటర్ చేసి ఆన్లైన్లో ఎవరు ఎన్ని కట్లు తీసుకున్నారన్న విషయాన్ని ధ్రువీకరించి ఆ రైతుకు ఎన్ని ఇవ్వాలన్నది కూడా నిర్ధారించి ఇవ్వడం జరుగుతుందని సొసైటీ సీఈవో శ్రీనివాసులు తెలిపారు.

## 14 డివిజన్లో పెన్షన్లు పంపిణీ చేసిన కార్పొరేటర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ ఆదేశాల మేరకు శనివారం నగర పాలక సంస్థ పరిధిలోని 14వ డివిజన్లో కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేశారు. ఒకటో తేదీకి ముందు రోజే నుంచే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు మంజూరు చేశామని తెలిపారు.

## పదవి విరమణ కార్యక్రమం

### మధుసూధన శతకం పుస్తకావిష్కరణ



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నగరంలోని ఆర్ఎస్ఆర్ ప్రధానోపాధ్యాయులు సింగరాజు మధుసూధన బాబు ఉద్యోగ విరమణ మహోత్సవాన్ని శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 1000 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఆయన శేష జీవితం అహ్లాదకరంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మధుసూధన శతకం పుస్తకావిష్కరణ కార్యక్రమం వైభవంగా సాగింది. కార్యక్రమంలో వాటర్ ఇన్ లాండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జెడ్.శివప్రసాద్, మాజీ ఏఎంసీ చైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యం, కార్పొరేటర్ మొగళ్ళపల్లి కామాక్షి దేవి, పెద్ద సంఖ్యలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని ఎస్ఐ-2 ఆల శ్రీను, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ రియాజ్‌లు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని దిలావర్బయివీధి క్రీడా మైదానంలో మెగా క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలు మానసికోల్లాసానికి, శారీరక ధృడత్వానికి ఉపయోగపడడంతోపాటు స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. ప్రశాంత వాతావరణంలో పోటీలను నిర్వహించుకోవాలన్నారు. యువత క్రీడలతోపాటు విద్యలో రాణించాలన్నారు. ఈ పోటీల్లో విజేతలైన వారికి ప్రథమ, ద్వితీయ బహుమతుల కింద రూ.30,116లు, రూ.20,116ల చొప్పున నగదు, ట్రోఫీ, ప్రోత్సాహక బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు జబ్బార్, ఎస్థానీ, చోటన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## పింఛన్ల పంపిణీ చేసిన డీఆర్‌డీఏ పీడీ



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలోని కాకుపల్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో స్వయంగా డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజకుమారి గ్రామంలోని పెన్షన్‌దారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక్కరోజు ముందుగా పెన్షన్ పంపిణీ చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలియజేశారు. అలాగే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేస్తున్న అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కాకుపల్లి మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య, టీడీపీ నాయకులు కోసూరు కేశవులు, కుంచనపల్లి శివకుమార్ పాల్గొన్నారు.